RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 23 ఆగస్ట్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:74

# గచ్చిబౌలి విషాదం..

## అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం: హైడ్రా కమిషనర్

**గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్**

**అంజయ్యనగర్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామని ప్రకటన**

**సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడి**





హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, దానిపై అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బిల్డర్ సాజిద్ నిర్మించే భవనాలన్నీ అత్యంత నాసిరకంగా ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. అంజయ్య నగర్ ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారని రంగనాథ్ పేర్కొన్నారు. నాలాలను ఆక్రమించి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపట్టారని, వీటిలో అధిక శాతం ప్రస్తుతం హాస్టళ్లుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన అన్ని భవనాలను కూల్చివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

**భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి**

**ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు**

**రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం**

**నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన**

**ఉమ్మడి నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన**




నిజామాబాద్‌లి : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి గారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

మిగతా 2 లో

# మహిళలు ఎవరికీ బానిసలు కారు.. మనుస్మృతి భావజాలంపై రాహుల్ గాంధీ ఫైర్

**పుణేలో విద్యార్థులతో రాహుల్ గాంధీ.. మహిళలే దేశానికి అతిపెద్ద బలమన్న వ్యాఖ్య**

**మనుస్మృతి భావజాలంపై తీవ్రంగా స్పందించిన రాహుల్**

**వేదికపై గిరిజన విద్యార్థుల సమస్యలను ఏకరువు పెట్టిన విద్యార్థిని**

**హాస్టళ్లలో పాముకాటు మరణాలు, బలవంతపు గర్భపరీక్షల ప్రస్తావన**

**వారి నిరసనకు హాజరవుతానని హామీ ఇచ్చిన లోక్‌సభ ప్రతిపక్ష నేత**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా 'మనుస్మృతి' నిర్దేశించిన పరిమితులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి అసలైన బలం, ఆస్తి 70 కోట్ల మంది మహిళలేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం పుణెలో "ఛాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో భాగంగా 'పింజ్రా తోడా' (పంజరాన్ని బద్దలుకొట్టండి) అనే థీమ్‌తో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.



ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశానికి అతిపెద్ద బలం ఏమిటని అడిగితే ఆర్థిక వ్యవస్థ, సైన్యం, జనాభా అంటూ రకరకాల సమాధానాలు చెబుతారు. కానీ నా దృష్టిలో భారతదేశానికి ఉన్న 70 కోట్ల మంది మహిళలే దేశానికి అతిపెద్ద శక్తి" అని అన్నారు. మహిళలు ఎవరికీ బానిసలు కారని ఉద్ఘాటించారు. బాల్యంలో ఉన్నప్పుడు తండ్రికి పనులు చేసిపెట్టడం కోసం, యవ్వనంలో భర్త కోసం, ఆ తర్వాత వృద్ధాప్యంలో కొడుకుల కోసం మహిళలు బతకాలనే మనుస్మృతి భావజాలం సిగ్గుచేటని విమర్శించారు. కుమార్తె, భార్య, తల్లి వంటి పాత్రలకే పరిమితం కాకుండా మహిళలు తమకంటూ ఒక సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నిషా అనే గిరిజన విద్యార్థిని ప్రసంగం అందరినీ కదిలించింది. గిరిజన విద్యార్థుల సమస్యలను ఆమె రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. పుణేలోని మంజరి ప్రాంతంలో తమ డిమాండ్ల సాధన కోసం గిరిజన విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారని, వారి దుస్థితిని వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన హాస్టళ్లలో కనీస వసతులు లేవని, 70-80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల నుంచి ఆహారం సరఫరా చేయడం వల్ల అది పాడైపోయి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల గడ్చిరోలిలోని ఆశ్రమ పాఠశాలలో పాముకాటు కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని నిషా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన గిరిజన విద్యార్థినులకు హాస్టళ్లలో బలవంతంగా గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని చెప్పడంతో సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఈ సమస్యలపై మంత్రులను కలిస్తే ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని చేతులెత్తేశారని, అలాంటప్పుడు వారికి పదవిలో ఉండే అర్హత లేదని ఆమె నిలదీశారు. విద్యార్థిని ఆవేదనకు స్పందించిన రాహుల్ గాంధీ, వారి నిరసన శిబిరానికి తనను ఆహ్వానించమని కోరారు. "నన్ను నిరసన స్థలానికి పిలవండి, నేను తప్పకుండా వస్తాను. నా రాకతో ప్రభుత్వం, యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందురోజు ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేయడంతో ఈవెంట్ ప్రశాంతంగా ముగిసింది.

# నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న సూత్రధారులను గుర్తించాలి: కొండా సురేఖ

**టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ**

**తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన**

**విచారణ జరుగుతుండగా బహిరంగ విమర్శలు చేయడం సరికాదని సూచన**

**ముఖ్యమంత్రిపై కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని చెప్పిన మల్లు రవి**



తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు.

కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు.

కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

వార్తా 3 లో

ప్రజాబలం

23 ఆగస్ట్ 2026 ఆదివారం

## బీజేపీ ఉచ్చులోనే కాంగ్రెస్

రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన విషయం ప్రత్యర్థి చూపించే దారిలో ప్రయాణించడం. శత్రువు విసిరిన వ్యూహంలో చిక్కుకుని, అతను నిర్దేశించిన మైదానంలోనే పోరాడటానికి సిద్ధపడటం ఆత్మహత్యాసదృశం!"కాంగ్రెస్ పార్టీ గత పన్నెండేళ్లుగా ఇదే చేస్తోంది. ఇప్పటికీ తెలుసుకోలేకపోతోంది. రాజకీయం అనేది ఎవరూ ప్రత్యేకంగా నేర్పే విద్య కాదు. మారుతున్న పరిణామాలను గ్రహించి, ప్రత్యర్థి వేసే ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సమాజంలోని అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడమే ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా ప్రాణాధారం. కానీ, దేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేడు ఆ ప్రాథమిక రాజకీయం కూడా చేతకావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది. ఒకవైపు స్పష్టమైన హిందూత్వ పోలరైజేషన్‌తో ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ , మరోవైపు కాంగ్రెస్‌ను కేవలం ముస్లింల పార్టీ గా చిత్రించే వ్యూహాన్ని అత్యంత ప్రతిభావంతంగా అమలు చేస్తోంది. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకత్వం ప్రతిసారీ బీజేపీ వేస్తున్న ఆ రాజకీయ ట్రాప్‌లోనే పడిపోతూ తన ఓటు బ్యాంకును, ఉనికిని కోల్పోతోంది.పోటీ ప్రపంచంలో ప్రత్యర్థి వేసే ముల్లును అదే ముల్లుతో తీయాలి తప్ప, ఆ ముల్లుపైనే అడుగులేస్తూ వెళ్లడం వివేకం అనిపించుకోదు. బీజేపీ తనపై వేస్తున్న ముస్లిం లీగ్ తరహా భావజాల ముద్రను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోతే, రాబోయే రోజుల్లో మిగిలిన కొద్దిపాటి ప్రాతినిధ్యాన్ని కూడా కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం మేధోపరమైన వ్యూహాల పేరుతో సాధారణ ప్రజల ప్రాథమిక ఆకాంక్షలకు, జాతీయ భావనలకు దూరంగా జరిగే కొద్దీ కాంగ్రెస్ తన సాంప్రదాయ ఓటు బ్యాంకును మరింత వేగంగా కోల్పోతూనే ఉంటుంది.ఇటీవలి ఎన్నికల విశ్లేషణల ప్రకారం కాంగ్రెస్ సాధిస్తున్న మెజారిటీ విజయాలు, ఓట్లు ఎక్కువగా వచ్చే ప్రాంతాలు మైనారిటీ జనాభా ఉన్నవే. బీజేపీ చేస్తున్న పోలరైజేషన్ ట్రాప్‌లో కాంగ్రెస్ నేరుగా వెళ్లి చిక్కుకోవడానికి నిదర్శనంగా వందేమాతరం' జాతీయ గేయం చుట్టూ జరుగుతున్న వివాదం నిలిచింది. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీలు నాటి రోజుల్లో సూచించిన అంశాలను సరికొత్త రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రీ-ఫ్రేమ్ చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలం అయింది. ప్రత్యర్థి విసిరిన భావజాల ఎరలో పడి, తన సార్వజనీన జాతీయ ప్రతిష్ఠను కోల్పోతూ మైనారిటీల తుది శరణాలయంగా మాత్రమే మిగిలిపోయేలా కాంగ్రెస్ స్వయంకృత అపరాధం చేస్తోంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోకుండా ఆనాటి పొరపాట్లనే మళ్లీ పునరావృతం చేయడం వల్ల, కాంగ్రెస్ పార్టీ భారతీయ ప్రజాస్వామ్యంలో తన ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిననే హోదాను మరింత వేగంగా కోల్పోతోంది. భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ అమలు చేసిన సామాజిక సమీకరణాల వ్యూహం అపూర్వమైన విజయాన్ని సాధించింది. దేశాన్ని దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ నిర్మించుకున్న సామాజిక పునాదిని ఈ వ్యూహం క్రమంగా, శాశ్వతంగా ధ్వంసం చేసింది. ఒకప్పుడు సమాజంలోని అన్ని వర్గాలను తన గొడుగు కిందకు తెచ్చుకున్న కాంగ్రెస్, నేడు తన సాంప్రదాయ ఓటు బ్యాంకులను ఒకటొకటిగా కోల్పోతూ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. చారిత్రకంగా కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఉన్నత వర్గాలు, పట్టణ మధ్యతరగతి ప్రజలను బీజేపీ అత్యంత చతురతతో తనవైపు తిప్పుకుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజిక వర్గాలతో పాటు వేగంగా ఎదుగుతున్న ఉపాధి ఆధారిత పట్టణ సమాజంలో సుపారిపాలన, ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక జాతీయవాదం అనే నినాదాలతో బీజేపీ గట్టి నమ్మకాన్ని నింపింది. కాంగ్రెస్ ప్రతిపాదించే సెక్యులరిజం కేవలం కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికే పరిమితమైందనే భావనను బలంగా ప్రచారం చేయడంలో అధికార పక్షం విజయం సాధించగా, ఈ నిర్ణయాత్మక ఓటు బ్యాంకు కాంగ్రెస్ చేజారి బీజేపీకి శాశ్వత బలగంగా మారింది.కాంగ్రెస్ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఓబీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలను చేరదీయడం బీజేపీ వేసిన అతిపెద్ద వ్యూహాత్మక ఎత్తుగడ. ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం, కాంగ్రెస్ ఆత్మరక్షణ వైఖరి వల్ల నిర్లక్ష్యానికి గురైన నాన్-యాదవ్ ాఃఅలు, చిన్న చిన్న వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించారు. సంస్థాగత పదవుల నుంచి చట్టసభల టిక్కెట్ల వరకు ఈ వర్గాలకు తగిన స్థానం ఇవ్వడం ద్వారా, కాంగ్రెస్ కేవలం కొన్ని కుటుంబాలు లేదా నాయకులకే పరిమితమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ శాశ్వత ఓటు బ్యాంకుగా పరిగణించే దళిత , గిరిజన వర్గాల్లోనూ బీజేపీ పట్టు సాధిస్తోంది. సాంస్కృతిక జాతీయవాదం, స్థానిక గిరిజన పోరాట యోధులకు గుర్తింపు ఇవ్వడం , పిఎం ఆవాస్, ఉజ్వల వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల నమూనా ద్వారా ఈ వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు తెచ్చింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలను నిశితంగా విశ్లేషిస్తే ఒక రకమైన మైనారిటీ క్లస్టర్ పార్టీగా పరిమితమవుతోందనే వాదన బలపడుతోంది. కాంగ్రెస్ తరఫున విజయం సాధిస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు ముస్లిం లేదా క్రైస్తవ జనాభా గణనీయంగా ఉండే ప్రాంతాల నుంచే వస్తున్నారని స్పష్టమవుతోంది. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణాదిలోని కొన్ని పాకెట్లలో ముస్లిం సాంద్రత ఎక్కువగా ఉన్న స్థానాల్లోనే కాంగ్రెస్ మెరుగైన ఓటు షేర్‌ను, సీట్లను సాధించగలుగుతోంది. దీనికి భిన్నంగా, మెజారిటీ సామాజిక వర్గాలు , ఇతర వెనుకబడిన తరగతులు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ రోజురోజుకూ తన పట్టును కోల్పోతోంది. అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం లేదా ప్రాంతీయ పార్టీలు, బిజెపిలతో పోలిస్తే ఉనికికే పరిమితమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇది కేవలం ఎన్నికల ఓటములతో ఆగిపోకుండా, కాంగ్రెస్ అంటే కేవలం మైనారిటీల ప్రయోజనాలనే పరిరక్షించే పార్టీ అనే రాజకీయ నిందకు బలం చేకూరుస్తోంది. బిజెపి తన సార్వత్రిక ప్రచారాల్లో ఈ అంశాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటూ, కాంగ్రెస్‌పై ముస్లింల పార్టీ ముద్ర వేసి మెజారిటీ వర్గాలను తనవైపు సమీకరించుకోవడంలో సఫలమవుతోంది. ఒక వైపు తన సాంప్రదాయక హిందూ ఓటు బ్యాంకును పునర్నిర్మించుకోవడంలో విఫలమవడం, మరోవైపు మైనారిటీ ఏకీకరణపైనే పూర్తి స్థాయిలో ఆధారపడాల్సి రావడం వల్ల పార్టీ జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటోంది.ఒకప్పుడు రాజకీయం అంటే తాము నిర్దేశించిన గీతే అనే ధీమా కాంగ్రెస్‌లో బలంగా ఉండేది. ప్రత్యర్థుల ఉనికి నామమాత్రంగా ఉన్న నాటి వాతావరణంలో వరుస విజయాలు ఆ పార్టీకి నల్లపూసలా మారాయి. కానీ ఆరెస్సెస్ అందించే క్షేత్రస్థాయి శ్రేణుల బలం, బీజేపీ సమకూర్చుకున్న ఆధునిక సాంకేతిక, వ్యూహాత్మక బలగాలు ఏకం కావడంతో భారత రాజకీయ చదరంగం రూపురేఖలే మారిపోయాయి. తమ ఓటు బ్యాంకు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నా, మార్పును గుర్తించి సరైన ఆత్మపరిశీలన చేసుకోకుండా కాంగ్రెస్ భావజాలపరంగా వరుస స్వయంకృత అపరాధాలు చేస్తూనే ఉంది.





లండన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.
లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపిన లివర్‌పూల్.
ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం



మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు.

రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడకు తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత
## ముగ్గురిపై కేసు నమోదు.. సివిల్ సప్లై గోదాముకు బియ్యం తరలింపు





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 22:** తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని సత్తుపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

పోలీసులు, సివిల్ సప్లై అధికారుల వివరాల ప్రకారం.. కిష్టారం గ్రామంలో రేషన్ షాప్ నిర్వహిస్తున్న నక్క వెంకటేశ్వరరావు, మధ్యవర్తి ఏపీకి చెందిన రాజా, కాకినాడకు చెందిన బాబీ కలిసి రేషన్ బియ్యాన్ని కాకినాడకు తరలించేందుకు ఆటోలో లోడ్ చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారంతో సత్తుపల్లి పోలీసులు దాడి చేసి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో ఉన్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించగా, అధికారులు పంచనామా నిర్వహించి బియ్యాన్ని సివిల్ సప్లై గోదాముకు తరలించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

**హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం**

**జర్నలిజం కేవలం వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత**

**ఖర్గే సభ తర్వాత జరిగిన శుద్ధీకరణ గురించి ప్రశ్నించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**








ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్ రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లాహిరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు.

?వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. ?సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు.

ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే... దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయాణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయోద్యమంలో పత్రికలది చెరగని ముద్ర భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తుచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని ఆయన చెప్పారు. పేర్కొన్నారు.

యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్లించారని అన్నారు.

మూక్ నాయక్, బహిష్కృత భారత్ వంటి పత్రికలను బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని అన్నారు. కేసరి, మరాఠా పత్రికల ద్వారా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వలస పాలకులను సవాలు చేశారని అన్నారు.

దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారంతా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలిచారని ఆయన కొనియాడారు. ఆ కాలంలో అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయని చెప్పారు.

ప్రజాస్వామ్యంలో పాలకులకు, పత్రికలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఒక చారిత్రక సంఘటనతో ఉపముఖ్యమంత్రి వివరించారు. 1948లో 'శంకర్స్ వీక్లీ'లో తనను నిరంతరం కార్టూన్లతో విమర్శించే శంకర్‌తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్‌నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

డిజిటల్ యుగంలో 'విశ్వసనీయతే' ఆయుధం సోషల్ మీడియా భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ, స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని ఆయన హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ... ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో... జర్నలిస్టులకు అసలైన ఆస్తి 'విశ్వసనీయత' మాత్రమేనని ఉద్ఘాటించారు.

జిల్లా రిపోర్టర్ల రక్షణే ముఖ్యం

కొత్తగా ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో టీచర్ లేకపోయినా, ఆసుపత్రిలో డాక్టర్ లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా రిపోర్టర్ల ద్వారానే అని, వారే ప్రభుత్వానికి 'అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ (ఋఱతీశ్రీ ఔఱతీఅఱఅస్త్ర ూవర్‌వఎ)' అని ఆయన కొనియాడారు.

తెలంగాణ గడ్డపై స్వేచ్ఛకు పెద్దపీట

?మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు.. స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన జర్నలిస్టులకు భరోసా ఇచ్చారని అన్నారు.

ఈ కాలంలో సమాచార కొరత లేదు.. నమ్మకం కొరత ఉంది. అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో జర్నలిస్టు వద్ద అత్యంత విలువైన ఆస్తి ప్రింటింగ్ ప్రెస్ కాదు.. విశ్వసనీయత అని భట్టి విక్రమార్క అన్నారు. జర్నలిజాన్ని రక్షించాలంటే జర్నలిస్టులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫెడరేషన్‌ను కోరారు. ముఖ్యంగా జిల్లా, చిన్న పట్టణాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు.

గ్రామీణ, జిల్లా స్థాయి జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం వంటి అంశాలను ప్రభుత్వానికి ముందుగా తెలియజేసేది తరచుగా స్థానిక జర్నలిస్టులేనన్నారు. "ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే.. మంచి జర్నలిస్టు ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ వంటివారు" అని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల స్వభావంలోనే స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సంప్రదాయం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఉద్యమాలు, సాహిత్యం, సంస్కృతిపై ఈ స్వభావం ప్రభావం చూపిందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత ఉందని, తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాలని అన్నారు.

కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ కేవలం మరో సంస్థగా కాకుండా ఒక బలమైన సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

## తెలంగాణలో తొలి జీవ వైవిధ్య ఉద్యానవనం

## కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభం




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి, ఆగస్టు 22:**లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లిలో తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన జీవ వైవిధ్య ఉద్యానవనం (బయోడైవర్సిటీ పార్క్)ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన ఆధ్వర్యంలో నిర్వహించారు.

కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, శ్రీమతి ఎ. దేవసేన, ఐ.ఏ.ఎస్. ప్రోత్సాహంతో, సత్సంగ్ ఫౌండేషన్ ఇండియాకు చెందిన ప్రవీణ్, కమరుద్దీన్ సహకారంతో ఈ జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు.

ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్, మేడ్చల్‌--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు.

ఉద్యానవనంలో భాగంగా మొత్తం 1,500 మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణ, పరిరక్షణ బాధ్యతలను సత్సంగ్ ఫౌండేషన్ ఇండియా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన తెలిపారు.

ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ విద్యార్థులతో ప్రత్యేకంగా సంభాషించారు. సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించేందుకు అవసరమైన కృషి, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన చదువు గురించి వివరించారు. తాను ఐ.ఏ.ఎస్. సాధించిన ప్రయాణంలో ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఆయన మాటలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాయి.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణాకర్, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు, ఇతర విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణలో పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన కల్పించడం లక్ష్యంగా చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్‌కు కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా నిలిచింది.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

హైదరాబాద్ రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖజాగూడ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ వద్ద డివైడర్ను బైకు ఢీకొట్టింది. ఘటనలో ఒక్కరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యయి. ఖజాగూడ నుండి అంజయ్య నగర్ వైపు వెళ్తుండగా, కేర్ ఖీఇ హాస్పిటల్ మెయిన్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదం జరిగింది. బైక్పై వెళ్తున్న ముగ్గురు యువకులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారు. వెనుక కూర్చున్న అబ్బాస్ సిద్ధిక్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న సహస్ర ఛటోపాధ్యాయ (25), అభిజిత్ సింగ్ (25)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులను తక్షణమే కేర్ హాస్పిటల్కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఇసుక లారీల తో ఇనుము తేలిన రోడ్డు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 22 మంగపేట** మంగపేట మండల కేంద్రంలోని వాడగూడెం రమణక్కపేట ఇసుక ర్యాంప్ ల నుంచి ప్రతి రోజు వందలాది లారీలు రోడ్లపై తిరగడంతో ఏటూరు నాగారం హనుమాన్ జంక్షన్ నుంచి బ్రాహ్మణ పెల్లి వరకు రోడ్లు పగిలిపోయి బీటలు పారాయి దీనితో ప్రయాణికులు ప్రయాణాలు చేయాలంటే భయంతో ప్రాణాలు అరచేతులు పెట్టుకొని ప్రయాణించవలసిన పరిస్థితి మంగపేట ప్రజలకు కనబడుతుంది ముఖ్యంగా ఇసుక లారీలు అధికలోడుతో రోడ్లపై తిరుగుతూ రోడ్లు కి రావడంతో రోడ్లు పగిలిపోతు ప్రయాణికులకు పనికి రాకుండా పోతున్నాయి ఇసుక ర్యాంప్ నిర్వాకులు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో రోడ్లన్నీ పగిలిపోయి పనికి రాకుండా పోతున్నాయి ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి మంగపేట కమలాపురం రోడ్డ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు



## పిల్లిగుండ్ల పాఠశాల లో విద్యార్థులతో పూర్వవైభవం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 (ప్రజా బలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పిల్లిగుండ్ల పాఠశాల మూతపడుతది అనుకున్న సమయంలో పూర్వ వైభవంతో పాఠశాల ల్లో విద్యార్థుల సంఖ్య పెరగ డం పట్ల గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి సంతోషం వ్యక్తపరిచారు పాఠశాలల విద్యార్థుల సంఖ్య పెరగడానికి ముఖ్య కారణంపాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు చేస్తున్న కృషి పట్టుదల ప్రశంసనీయమని గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి తెలిపారు నాడు విద్యార్థ లు 15 మంది నేడు విద్యార్థులు 70 మంది అని తెలిపారు మర్పల్లివిద్యాధికారి ఎప్పుడు చూసినా ఒక మాట చెప్పేది ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థులుప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాభ్యాసంలో పోటీకి సిద్ధమని మర్పల్లి విద్యాధికారి బి అశోక్ సవాల్ నిజమయ్యేలా మర్పల్లి మండల పాఠశాలలో ఉపాధ్యాయుల టీచర్స్ కృషి సమయపాలనపట్టుదల ప్రశంసనీయమని పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి తెలిపారు

## అంగడి పేరుతో ఆగమవుతున్న ప్రయాణికులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 22 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంగడి వేల ప్రతి శనివారం నిర్వహించే అంగడి వలన బాటసారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి

ముఖ్యంగా ఏటూరు నాగారం నుంచి మంగపేట రామ్ నగర్ కమలాపురం రామన్నగూడెం వెళ్లే ప్రయాణికులకు గ్రామ ప్రజలకు పెద్ద ఎత్తున ఇబ్బందులను కలిగిస్తున్నాయి ప్రజలు నడిచే రహదారిపై



అంగడి ఏర్పాటు చేయడం ప్రయాణికులకు హక్కులను కాలరాయడమేనని రోడ్డుపని నిర్వహిస్తున్న అంగడి ఆటంకంగా ఎదురవుతుంది దీనితో ఆపదలో ఉన్న వాహనాలకు దారిలేని పరిస్థితి కనపడుతుంది ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్లపై అంగడి నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను బాటసారులు కోరుతున్నారు

## అన్నారుగూడెంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు శ్రీకారం.

### తల్లాడ మాజీ ఎంపీపీ చొరవతో గ్రామాభివృద్ధికై ప్రాధాన్యం..

### కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్స్,ప్రజా ప్రతినిధులు..

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** అన్నారుగూడెం గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అన్నారుగూడెం గ్రామంలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు ఆ గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ శ్రీకారం చుట్టారు. మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు చొరవతో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభించారు.



గ్రామంలో వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని గ్రామస్థులు తెలిపారు. వర్షపు నీటి సంరక్షణతో పాటు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే చర్యల్లో భాగంగా ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.గ్రామ అవసరాలను గుర్తించి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు చొరవ తీసుకుంటూ, తనవంతు సహకారం అందిస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.ఆయన సూచనలు, సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ తెలిపారు.మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు చొరవ, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నారుగూడెం అభివృద్ధికి దోహద పడుతున్నాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణకు సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టడం అభినందనీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,స్థానిక వార్డు మెంబర్ గొడ్ల డేవిడ్,గ్రామ ఎస్సీ సెల్ నాయకులు ఇస్నపల్లి శ్రీను, పంచాయతీ సెక్రటరీ కే.వెంకటేశ్వర్లు, పంచాయతీ గుమస్తా రమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ హుస్సేన్, కాలనీవాసులు ఇస్నపల్లి గురవయ్య, గొడ్ల సాల్మన్,శ్రీన మోసే,ఇస్నపల్లి నాగేంద్ర,ఇస్నపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో తెలంగాణలోనే తొలి 'బయోడైవర్సిటీ పార్క్' ప్రారంభం



**కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 22:** కూకట్‌పల్లిలో బయోడైవర్సిటీ పార్క్ (జీవ వైవిధ్య ఉద్యానవనం) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన తెలిపారు

కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎ. దేవసేన, ఐ.ఏ.ఎస్. ప్రోత్సాహంతో సత్సంగ్ ఫౌండేషన్ ఇండియా కు చెందిన ప్రవీణ్, కమరుద్దీన్ సహకారంతో, ఈ బయోడైవర్సిటీ పార్క్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది

ఈ బయోడైవర్సిటీ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలను నాటారు.

ఈ బయోడైవర్సిటీ పార్క్‌లో మొత్తం 1,500 మొక్కలను నాటడం జరిగింది. ఈ మొక్కల సంరక్షణ పరిరక్షణ బాధ్యతలను సత్సంగ్ ఫౌండేషన్ ఇండియా నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన తెలిపారు.

ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించారు. అనంతరం, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఐ.ఏ.ఎస్ మొక్కలను నాటిన తరువాత విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. సివిల్ సర్వీసెస్‌లో విజయాన్ని సాధించి ఐ.ఏ.ఎస్. అధికారి కావడానికి అవసరమైన కృషి, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన చదువు గురించి వివరించడంతో పాటు, తాను ఐ.ఏ.ఎస్. సాధించిన ప్రయాణంలోని వ్యక్తిగత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. వారి ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కరుణాకర్ అధ్యాపకులు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు, ఇతర విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మొగునూరి మాణిక్యంకు మాజీ ఎంపీపీ దొడ్డ నివాళి.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం**తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన మొగునూరి మాణిక్యం శనివారం మృతి చెందారు.అమె మృతి పట్ల తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.మొగునూరి మాణిక్యం మృతదేహాన్ని మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, మాణిక్యం మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ కూడా మృతదేహానికి నివాళులర్పించారు. మాణిక్యం మృతి గ్రామానికి తీరని లోటని,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,ఈ విషాద సమయంలో వారికి అండగా ఉంటామని మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, స్థానిక పంతులు గారు సంతోష్,ఆ ప్రాంత కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉచిత శిక్షణతో ఉద్యోగ అవకాశాలు

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 22**:లి యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో అకాడమీ ఫర్ కెరీర్స్ ఇన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉద్యోగ నియామక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి ఎం. రాధిక తెలిపారు.

ఫ్రెష్‌వర్క్స్ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద ఎడ్యునెట్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. యువతకు పరిశ్రమలకు అనుగుణమైన డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు కండ్లకోయలోని సి.ఎం.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల్లో 12వ తరగతి ఉత్తీర్ణులైన, 18 సంవత్సరాలు నిండిన యువత అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

15 నెలల పూర్తి స్థాయి శిక్షణ కార్యక్రమంలో మూడు నెలల ప్రాజెక్టు ఆధారిత శిక్షణ, నిరంతర ఉద్యోగ మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం అర్హత సాధించిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు రూ.72,000 వరకు ఆర్థిక సహాయంతో కూడిన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యత కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్, శిక్షణ, ధ్రువపత్రాలు, నియామకం వంటి సేవలను విద్యార్థులకు ఎటువంటి రుసుము లేకుండా అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అభ్యర్థులు *act.edunetworld.com* వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని లేదా నేరుగా కార్యక్రమానికి హాజరై నమోదు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి

ఫోన్: 8328034896, 9121323693, 9866465024 నెంబర్లలో సంప్రదించవచ్చు అని తెలిపారు.

ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న అర్హత కలిగిన యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి శ్రీమతి ఎం. రాధిక కోరారు.

## క్రీడాకారులను ఘనంగా సత్కరించిన ఏటూరునాగారం గ్రామ పెద్దలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్ట్ 22 ఏటూరు నాగారం** ఏటూరునాగారం క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొంది, తమ ప్రతిభను చాటుకున్న నలుగురు క్రీడాకారులు ప్రస్తుతం హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ వద్ద శిక్షణ పొందుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటూరునాగారం కోచ్ పర్వతాల కుమారస్వామి అక్షర, హర్షిత, హర్షిని, సంజన అనే నలుగురు క్రీడాకారుల ప్రతిభను గుర్తించి నాగపురి రమేష్ గారి దృష్టికి తీసుకెళ్లారు. వారి ప్రతిభను పరిశీలించిన అనంతరం ఎంపిక చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా ఈరోజు ఏటూరునాగారం క్రీడా ప్రాంగణంలో ఉదయం సాధన చేస్తున్న ఈ నలుగురు క్రీడాకారులను గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, చిటమట రఘు, గడదాసు సునీల్ కుమార్, ఎల్లయ్య వావిలాల నరసింహారావు, గంపల నరసయ్య, ముత్తయ్య, వావిలాల సాంబశివరావు, చంద్రబాబు, దుర్గారావు, శ్రావణ్ కుమార్, చరణ్, సతీష్, సత్యం, సిరాజ్, వావిలాల చంద్రరావు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలాగే కోచ్‌లు భావన, నందిని మరియు పలువురు క్రీడాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రావణమాసంతో పూజ వస్తువుల ధర రెట్టింపు

విజయవాడ ఆగస్టు 22, శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లూ కళకళలాడిపోతుంది. పూజలు, వ్రతాలతో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది.హిందువులకు శ్రావణ మాసం వచ్చిందంటే పండగ వాతావరణమే. మహిళలు తాము ముస్తాబవ్వడమే కాకుండా ఇంటిని కూడా చూడచక్కని విధంగా అలంకరిస్తారు. దాంతో ప్రతి శుభకార్యంలో తప్పక కావాల్సిన తమలపాకు ధరకు రెక్కలు వచ్చాయి. ప్రతీ తాంబూలంలోనూ తమలపాకే ముఖ్యం. తమలపాకు లేనిదే ఏ శుభకార్యం కూడా జరగదు. దాంతో తమలపాకుతో పాటు అరటిపళ్లు, కొబ్బరి కాయలు, పూల రేట్లకు రెక్కలు వచ్చాయి.రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న చింతలపూడి, మాచవరం, ములుకుదురు ప్రాంతాల్లో తమలపాకు తోటలు ఉన్నాయి. రైతు వద్ద తక్కువకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. తమ కొట్లల్లో మాత్రం భారీగా అమ్మేస్తున్నారు. ఎందుకంటే పండగ సీజన్‌లో తమలపాకుకు ఉన్న డిమాండ్ అలాంటిది. రైతు వద్ద 150 ఆకుల కట్టను రూ. 16కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. విడిగా ప్రజలకు మాత్రం ఒక్కొక్కటి రూపాయి చొప్పున విక్రయిస్తున్నారు. మంగళగిరి ప్రాంతంలో అయితే 30 ఆకులను రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు.తమలపాకుతో పాటు కొబ్బరి కాయలు కూడా భారీగా పెరిగాయి. శ్రావణ మాసానికి ముందు కొబ్బరి కాయ సైజును బట్టి రూ. 15 నుంచి రూ. 35 మధ్య అమ్మేవారు. ప్రస్తుతం మీడియం సైజు కాయ ధరే రూ. 50 ఉంది. అరటి పళ్లు కూడా గతంలో డజను రూ. 40 నుంచి రూ. 60 వరకు అమ్మేవారు. ఇప్పుడు అదే అరటి కాయ ప్రాంతాన్ని బట్టి పెరిగిపోయింది. యావరేజ్‌గా రూ. 80 నుంచి రూ. 100 వరకు అమ్మేస్తున్నారు.వర్షాభావ పరిస్థితుల్లో పూలకు మంచి డిమాండ్ పెరిగింది. వర్షాలు సరిగా లేకపోవడంతో కాల్వల కింద, బోర్ల కింద పండిస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. గతంలో రూ. 200 లోపే ఉండే చిట్టి గులాబీలు ఇప్పుడు రూ. 350 నుంచి రూ. 400 వరకు అమ్ముతున్నారు. చామంతులు రూ. 150 ఉంటే ఇప్పుడు రూ. 350 పెరిగింది. బంతి పూలు కిలో రూ. 30 ఉంటే రూ. 70కి పెరిగాయి. మొత్తానికి శ్రావణమాసంలో పూజలకు ఉపయోగించే సామగ్రి సామాన్యుడి నడ్డి విరుస్తుంది.

## ఎప్పుడూ ఆ నియోజకవర్గం రాజకీయమే




అనంతపురం, ఆగస్టు 22,రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు రగులుతున్నాయి. నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవ ర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసే వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది. అన్నట్టుగా తాడిపత్రి నియోజకవర్గం మారిపోవడం గమనార్హం. సహజంగా ఎన్ని కలకు ముందు రాజకీయాలు ఉంటాయి. కానీ, వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేల మధ్య వ్యక్తిగత అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. దీనిని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే అంశంపైనే తాడిపత్రి నియోజకవర్గం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతకు మించి.. వ్యక్తిగత దూకుడును ప్రజలు అర్థం చేసుకుంటారా.. లేదా? అనేది చూడాలి. ప్రస్తుతం అయితే.. జేసీ హవా ఓ రేంజ్ లో సాగుతోందన్నది వాస్తవం.

## మళ్లా పెరుగుతున్న బంగారం ధరలు



ముంబై,ఆగస్టు 22, (న్యూస్ పల్స్) బంగారం, వెండి ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్లో మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. దీంతో దేశీయంగా కూడా మళ్లీ గోల్డ్, సిల్వర్ రేట్లు ఎగబాకుతున్నాయి. గత 10 రోజుల వ్యవధిలో కేవలం ఒక్క రోజు మాత్రమే బంగారం ధర తగ్గింది. మిగతా అన్ని రోజులు భారీగా పెరుగుతూ పోయింది. ఈ క్రమంలో దాదాపు రూ. 6-7 వేల వరకు రేటు పెరిగిందని చెప్పొచ్చు. ఇంటర్నేషనల్ మార్కెట్లో ప్రస్తుతం స్పాట్ పసిడి రేటు ఔన్సుకు 4600 డాలర్ల మార్కు దాటి ట్రేడవుతోంది. సిల్వర్ ధర 69 డాలర్ల మార్కు వద్ద ఉంది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ప్రస్తుతం రూ. 95.73 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని దిల్లీలో ప్రస్తుతం 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,47,250 వద్ద ఉండగా, 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 1,60,630 వద్ద ఉంది. చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతాల్లో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల పసిడి ధర వరుసగా రూ. 147100, రూ. 160480 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయంగా కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆగస్ట్ 22న ఉదయం 7.30 గంటల సమయంలో హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1100 పెరిగి తులం రూ. 1,47,100 వద్ద ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1210 పెరగడంతో 10 గ్రాములకు రూ. 1,60,480 వద్ద ఉంది.మరోవైపు హైదరాబాద్ మార్కెట్‌లో సిల్వర్ రేటు ఆగస్ట్ 22న రూ. 5 వేలు పెరిగింది. దీంతో ప్రస్తుతం కేజీకి రూ. 2.65 లక్షల వద్ద ఉంది. ముందటి రోజు వెండి ధర ఏకంగా రూ. 10 వేలు పెరగ్గా, దానికి ముందు మాత్రం రూ. 5 వేలు పడిపోయింది. ఇక గత 2 రోజుల వ్యవధిలో చూస్తే సిల్వర్ రేటు రూ. 15 వేలు ఎగబాకింది.ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరిగాయి. అమరావతి, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 147100 వద్ద ఉండగా, 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ. 160480 వద్ద ఉంది.

ఇటీవల యూఎస్ డాలర్, బాండ్ ఈల్డ్స్ డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు మాత్రం అవి వరుసగా గరిష్ఠ స్థాయిల నుంచి దిగొస్తుండగా, గ్లోబల్ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు పుంజుకుంటున్నాయి. దీంతో ఇంటర్నేషనల్ మార్కెట్ ధరలకు అనుగుణంగానే దేశీయంగా కూడా రేట్లు పుంజుకుంటున్నాయి.

భారతదేశంలో ఏయే అంశాలు బంగారం ధరల్ని ప్రభావితం చేస్తాయి?

నేరుగా అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు, దేశీయంగా నేరుగా ప్రభావం చూపిస్తాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతాయి. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతాయి. ఇంకా ద్రవ్యోల్బణం, రూపాయి విలువ హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు, ప్రభుత్వాలు విధించే సుంకాలు బంగారం, వెండి ధరల్ని ప్రభావితం చేస్తుంటాయి.

## కొండాకు పదవీ గండం...

వరంగల్, ఆగస్టు 22 కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు.మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

## ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం





యాదాద్రి.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతీ గూడెం గ్రామంలో హెజిలో ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలు భారీగా ఎగిసి పడ్డాయి. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసారు. ఘటనలో గాయాపడ్డ ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. మరో పది మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు క్షగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రియాక్టర్ పేలడం తో ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలడం తో భారీ శబ్దానికి దోతీ గూడెం, అంతమ్మా గూడెం గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. మూడు నెలల పరిధి లో రెండవ సారి ప్రమాదం ఈ కంపెనీ లో చోటు చేసుకుంది. ...

## ధనుష్ పొలిటికల్ ఎంట్రీ



చెన్నై ఆగస్టు 22, (న్యూస్ పల్స్) తమిళ స్టార్ ధనుష్ చుట్టూ పొలిటికల్ ఎంట్రీకి సంబంధించిన చర్చ రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఆయన సోషల్ మీడియా ప్రెజెన్స్‌ను మరింత బలోపేతం చేసేందుకు.. రాజకీయ పార్టీల డిజిటల్ టీమ్స్ తరహాలో ప్రత్యేకంగా ఓ ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.ఈ డిజిటల్ టీమ్ కోసం దాదాపు ?1 కోటి వరకు ఖర్చు చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో ధనుష్‌కు సంబంధించిన కంటెంట్‌ను పర్యవేక్షించడం, ఫ్యాన్ బేస్‌ను మరింత యాక్టివ్‌గా మార్చడం, ఆయన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి బాధ్యతలు ఈ టీమ్ చూసుకోనుందని టాక్.ఇది నిజమైతే.. కేవలం సినిమా ప్రమోషన్ కోసం ఏర్పాటు చేస్తున్న టీమ్ కంటే చాలా పెద్ద వ్యవస్థగా ఉండొచ్చనే చర్చ మొదలైంది. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ పార్టీల ఐటీ వింగ్స్ సోషల్ మీడియా నేరేటివ్, గ్రౌండ్ లెవల్ కమ్యూనికేషన్, డిజిటల్ క్యాంపెయిన్లలో కీలకంగా మారిన నేపథ్యంలో.. ధనుష్ కూడా అదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారన్న వార్త ఆసక్తిని పెంచుతోంది.ఇప్పటికే ధనుష్ ఫ్యాన్ క్లబ్స్‌లో కదలికలు పెరిగాయి. సంక్షేమ కార్యక్రమాలు చేయాలని అభిమానులకు ఆయన పిలుపునివ్వడం, ఫ్యాన్ క్లబ్ కార్యకలాపాలు విస్తరించడం, కొన్ని ప్రాంతాల్లో వాటిని మరింత వ్యవస్థీకృతం చేయడం వంటి పరిణామాలు పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.అయితే.. ధనుష్ రాజకీయాల్లోకి వస్తున్నారన్నది ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ?1 కోటి ఖర్చుతో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నారన్న వార్తకు కూడా ధనుష్ లేదా ఆయన టీమ్ నుంచి అధికారిక ధృవీకరణ లేదు.కానీ వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ధనుష్ విషయంలో అసలు సినిమా ఏంటి, పొలిటికల్ స్కెచ్ ఏంటి అనేది ఇప్పుడు తమిళనాట ఆసక్తికరంగా మారింది

## మరో ఎంపీకి అమాత్య యోగం

హైదరాబాద్ ఆగస్టు 22 కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన అరుణ అన్నిరకాలుగా సీఎం స్పీడుకు బ్రేకులు వేయగలరని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దన్నుగా ఉంటున్న అగ్రవర్ణాలలోనూ చీలక తేవడానికి అరుణ నాయకత్వం ఉపయోగపడుతుందనే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ఆమెకు దీటుగా బీసీ నేత లక్ష్మణ్ పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు. తొలి నుంచి బీజేపీలో కొనసాగుతున్న లక్ష్మణ్ కు సంఘ్ నేపథ్యం అదనపు బలంగా చెబుతున్నారు. దీంతో రాష్ట్రం నుంచి డీకే అరుణ, లక్ష్మణ్ మధ్య మంత్రి పదవికి గట్టి పోటీ జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

## వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారం అందజేత

అమరావతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడవ విడత పరిహారా అందచేసారు. 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారం అందించారు. .. సీఎం క్యాంపు కార్యాలయంలో రూ.250 కోట్ల చెక్కు అందించారు. . మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు చెల్లించిన ప్రభుత్వం.. రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు చెల్లించింది. మూడో విడతగా ఇవాళ మరో 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు అందించింది. .. ఇవాళి పరిహారంతో కలిపి 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పంపిణీ అయింది. ఇప్పటివరకూ 85 శాతం మేర ఆర్అండ్ఆర్ పూర్తి అయింది. సీఎం చంద్రబాబు . త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించనున్నారు.

# సగం హైదరాబాద్ లో సెటిలర్స్ ప్రభావమే...

# 28 నియోజకవర్గాల్లో 15 చోట్ల డామినేషన్

హైదరాబాద్, ఆగస్టు 22 ఆంధ్రా సెటిలర్స్ ఈసారి హైదరాబాద్‌లో ఓట్లేయడం లేదా.. అన్న విషయం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ తర్వాత భారీగా ఓట్లు కేటగిరీలోకి వెళ్లడం, మరికొన్ని లక్షల ఓట్లు ఉండటం హైదరాబాద్ రాజకీయాలపై కొత్త చర్చకు తెరతీసింది.

సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తగ్గుదల ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ఎన్నికలు అనగానే ప్రత్యేకంగా చర్చకు వచ్చే అంశాల్లో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఒకటి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక వర్గంగా చాలాకాలంగా చర్చలో ఉంటున్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 15 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం గణనీయంగా ఉందనే అంచనాలు ఉన్నాయి.ప్రతి ఎన్నికల సమయంలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ జరుగుతూనే ఉంటుంది.

అయితే ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది.తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ?లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగించడం మరికొన్ని ఓట్లను పెండింగ్‌లో ఉంచడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను తొలగించారు. వీళ్లను లో పెట్టారు. అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన వారు, తొలగించబడిన లేదా డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి ఓట్లు ఈ కేటగిరీలోకి వెళ్లాయి. అంటే.. మళ్లీ అప్లై చేసుకుంటే తప్ప ఈ ఓట్లు లేనట్లే. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73 లక్షల ఓట్లు పోయాయంటే.. మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి బయటకు వెళ్లినట్టవుతుంది. తర్వాత తెలంగాణ ఓటర్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు మిగిలాయి. అయితే ఈ ఓట్లన్నీ పూర్తిగా ధృవీకరించినవని చెప్పలేమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. మరో 92,87,577 ఓట్లను విత్ హెల్డ్ కేటగిరీలో ఉంచారు. ఈ ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో వాలిడేషన్ పూర్తికాలేదని చెబుతున్నారు.అంటే తెలంగాణలో తొలగించబడిన 73 లక్షల ఓట్లతో పాటు మరో దాదాపు 93 లక్షల ఓట్లు కూడా ప్రస్తుతం తుది స్థితిలో లేవు.తొలగించిన, పెండింగ్‌లో ఉంచిన ఓట్లను కలిపితే ఈ సంఖ్య దాదాపు 1.66 కోట్లు.అంటే తెలంగాణ మొత్తం ఓటర్లలో దాదాపు సగం ఓట్లు ఏదో ఒక రకంగా ప్రభావానికి లోనైనట్టుగా కనిపిస్తోంది.ఇక్కడే అసలు కీలకమైన విషయం బయటకు వస్తోంది. తెలంగాణలో కేటగిరీలోకి వెళ్లిన 73 లక్షల ఓట్లలో 43 లక్షల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోనే ఉన్నాయని లెక్కలు సూచిస్తున్నాయి. అంటే తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలగించబడిన ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈ మూడు జిల్లాల్లో మరో 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అంటే తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ఆమోదించబడని ఓట్లలో దాదాపు 83 లక్షలు కేవలం ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.ఇక్కడి నుంచే కేవలం ఓటర్ల లెక్కలకు సంబంధించిన అంశమేనా? లేక హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా? అనే ప్రశ్న మొదలవుతోంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇందులో 43 లక్షల ఓట్లు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని దాదాపు 37 శాతం ఓట్లు ప్రభావితమయ్యాయి. తెలంగాణలో నమోదైన ప్రతి 100 ఓట్లలో దాదాపు 59 ఓట్లు హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఉన్నట్లు కనిపిస్తోంది.అయితే ఈ 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదుహైదరాబాద్ ఒక మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.

అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ మార్పులు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ వంటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

మొత్తంగా కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 చోట్ల ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇక కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ తిరిగి ఇవ్వని వారి శాతం కూడా గమనించదగ్గ స్థాయిలో ఉంది. సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్‌బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి ఇవ్వలేదని లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పలేం కానీ.. ఈ నియోజకవర్గాల పరిధిలో ఆంధ్రా ప్రజలు ఎక్కువగా ఉంటున్నారన్నది నిజం. వాళ్లలో మెజారిటీ ఆంధ్రా ప్రాంతంలోనే ఓటుహక్కును కొనసాగించుకున్నారు. ఈ విషయంలు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తెలిసింది. చాలా కాలనీల్లో " మేం మా ఊళ్లలోనే ఓటును కొనసాగించుకుంటాం" అని చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల తగ్గుదల గణనీయంగా కనిపిస్తోంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా, దాదాపు 42 శాతం ఓట్లు తగ్గిన నియోజకవర్గంగా ఇది నిలిచింది. ఆ తర్వాత ఎల్‌బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి.అయితే ఒక నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు తగ్గాయి అన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యం కాదు. ఎవరి ఓట్లు తగ్గాయి? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం ప్రతి పార్టీపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపదు.ఈ మూడు జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది.

పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న హైదరాబాద్ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. వారిలో దాదాపు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం ఓటర్లపై ప్రభావం పడినట్టుగా కనిపిస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో అనేక మంది ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించలేకపోవడం వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. డాక్యుమెంట్లు ఇచ్చిన వారిలో కూడా 12లక్షల మందికి ఇక్కడ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే తొలగించబడిన ఓట్లతో పాటు మరో భారీ సంఖ్యలో ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు వెళ్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. పత్రాల్లో తప్పులు, 2002 మ్యాపింగ్‌తో సరిపోని వివరాలు వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు.

ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని ఓట్లు తుది జాబితాలోకి వస్తాయి? అనేది తదుపరి ప్రక్రియలో తేలాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 12లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తొలగించిన ఓట్లకు ఇవి అదనం.

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్స్... రాజకీయంగా కొంత ప్రభావం చూపించారు. వీరిలో కొంతమంది ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారున్నారు. ఇప్పుడు ఓట్ల రివిజన్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోనుందా అన్న చర్చ మొదలైంది. ఇక్కడ సెటిలైన వారు.. హైదరాబాద్ ఓటర్లుగా పూర్తిగా మారారా?లేక... "మా ఓటు సొంత రాష్ట్రంలోనే కొనసాగాలి" అని నిర్ణయించుకున్నారా? అనే ప్రశ్న వస్తోంది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే ఒక ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడుతుంది.

"హైదరాబాద్‌లో ఆంధ్రా జనాభా కనిపిస్తుంది. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు." ఇది హైదరాబాద్‌లోని రాజకీయ పార్టీలకు కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది.హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అభిప్రాయం కూడా పూర్తిగా సరైంది కాదు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంత మొగ్గు ఆ పార్టీ వైపు ఉండేదనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. కానీ ఇప్పుడు తెలంగాణ రాజకీయ పరిస్థితి మారిపోయింది. తెలంగాణలో ప్రధాన రాజకీయ పోటీ తెలంగాణకు చెందిన పార్టీల మధ్యనే సాగుతోంది. అందువల్ల ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ఏ పార్టీకి ఎంత నష్టం? ఏ పార్టీకి ఎంత లాభం? అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పడం కష్టం.ాఎఖీ ప్రక్రియ కేవలం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మాత్రమే.

అయితే కేవలం మూడు జిల్లాల పరిధిలోనే దాదాపు 80లక్షల ఓట్లు తొలగిపోవడం, పెండింగ్‌లో ఉండటం అనేది.. చిన్న విషయం కాదు.

ఇది భవిష్యత్‌లో రాజకీయంగా తీవ్ర ప్రభావాన్ని చూపించే అంశం. ముఖ్యంగా ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్యలో వచ్చిన మార్పులతో రాజకీయ పార్టీలు తమ ప్లానింగ్ మార్చుకోవలసి పరిస్థితి. ఇక ఏ ప్రభావాలకు లొంగని పాతబస్తీ ప్రాంతం కూడా ఈ?సారి కుదుపునకు గురైంది. ప్రత్యేకంగా ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో 35శాతం ఓట్లు తగ్గిపోయాయి. ఏకపక్ష మెజార్టీలతో గెలుస్తున్న కు ఇది కాస్త ఇబ్బందికరమే. ఇది గెలుపుపై ప్రభావం చూపకపోయినా.. మిగిలిన పార్టీలకు పోటీ ఇవ్వడానికి అవకాశం కల్పిస్తుంది. ఆంధ్రావాళ్ల ఓట్లన్నీ తెలంగాణ నుంచి వెళ్లిపోయావా..కు భారీ గండి పడబోతోందా అన్నది తుది ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతనే తేలనుంది.

## కాంగ్రెస్ లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు





హైదరాబాద్, ఆగస్టు 22 తెలంగాణలో మరోసారి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్న వేళ, సొంత పార్టీలోనే అసమ్మతి సెగలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సహజ సిద్ధమైన "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి సీనియర్ల అసంతృప్తి ఒక ఎత్తయితే, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ నేరుగా ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.వరంగల్ జిల్లా గీసుకొండ వేదికగా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అసలైన ఘర్షణ స్వభావాన్ని బయటపెట్టాయి. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ ఆమె నేరుగా సిద్ధాంతపరమైన దాడికి దిగారు. పరకాల టికెట్ వ్యవహారంలో సీఎం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ, "మాకు టికెట్ నిరాకరించడానికి రేవంత్ రెడ్డి ఎవరు?" అని ప్రశ్నించడం అధిష్టాన స్థాయికి చేరిన అంతర్గత పోరును సూచిస్తోంది. కొడంగల్‌లో గతంలో ఆయన ఓడిపోయిన సందర్భాన్ని, రేవంత్‌ను పీసీసీ అధ్యక్షుడిగా సమర్థించిన గతాన్ని ప్రస్తావిస్తూ స్వతంత్రంగానైనా బరిలోకి దిగుతానని హెచ్చరించడం తీవ్ర స్థాయి ధిక్కారానికి నిదర్శనం. ఈ తిరుగుబాటు కేవలం ఒక్క నియోజకవర్గ టికెట్ పోరు మాత్రమే కాదు. కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యం దక్కుతోందని, ఉద్యమ కాలం నుంచి పార్టీని మోసిన పాత తరం నేతలు, ముఖ్యంగా బీసీ నాయకత్వం క్రమంగా పక్కకు నెట్టివేయబడుతోందనే అసహనం ఈ వరుస ప్రకటనల్లో స్పష్టంగా వ్యక్తమవుతోంది.మరోవైపు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణా కమిటీ ఈ పరిణామాలను అదుపు చేయడంలో పూర్తిగా నిస్సహాయంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం, పార్టీ విధానాలపై బహిరంగంగా విరుచుకుపడుతున్న కీలక నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం నాయకత్వ లోపాన్ని, సమన్వయ లేమిని ఎత్తిచూపుతోంది. ఎంపీ మల్లు రవి వంటి సీనియర్లు క్రమశిక్షణపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, పాలనాపరమైన సంస్కరణలపై దృష్టి సారిస్తున్న సమయంలో, సొంత క్యాబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అంతర్గత కుమ్ములాటల రూపంలో సాగుతున్న ఈ పరిణామాలు ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారుతున్నాయి.పాలనపై ప్రతిపక్షాల విమర్శల కంటే సొంత పార్టీ నేతల అసమ్మతి బాణాలే ప్రభుత్వానికి పెద్ద ముప్పుగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఏఐసీసీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని సమన్వయ కమిటీ ద్వారా అసమ్మతి నేతలతో చర్చలు జరపకపోతే లేదా కఠినమైన క్రమశిక్షణా చర్యలు చేపట్టకపోతే, ఈ అంతర్గత విభేదాలు మరింత విస్తరించి ప్రభుత్వ స్థిరత్వానికే పెద్ద సవాలుగా మారే అవకాశముంది.

## విశాఖలో విద్యార్థుల గ్యాంగ్ వార్

## అదుపులోకి పలువురు విద్యార్థులు

విశాఖపట్నం విశాఖ శివశక్తినగర్లో రెండు వర్గాలుగా విడిపోయిన యువకులు కర్రలతో ఘర్షణకు దిగారు. ప్రేమ వ్యవహారమే కారణంగా తెలుస్తోంది. ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మొత్తం 20 మందిలో 17 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మేజర్లు, ముగ్గురు మైనర్లు ఉన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## చిన్నతిప్ప సముద్రంలో బీహార్ యువకుడి పై హత్యాయత్నం



అన్నమయ్య జిల్లాలో అమానుష ఘటన జరిగింది. ఇంస్టాగ్రామ్ లో ప్రేమ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నాడని, అమ్మాయి తరపు బంధువులు బీహార్ యువకున్ని అర్థ రాత్రి అడవి సమీపానికి తీసుకెళ్లి ప్లంబర్ పైపులతో విచక్షణారహితంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. శనివారం ఉదయం వెలుగు చూసిన తీవ్ర కలకలం రేపే ఘటనకు సంబంధించి బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు.. మదనపల్లి మండలం, సీటీఎం లోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న బీహార్ యువకుడు ముకేశ్ (20) మదనపల్లెలోని శ్రీనివాస సిమెంట్ అంగడిలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్లిన ముకేశ్ ను అమ్మాయి తరపు బంధువులు ఐదుగురు వచ్చి, మాట్లాడే పని ఉందని ఊరికి సమీపంలో ఉన్న అడవిలోనికి తీసుకెళ్లారు. తెల్లవారుజాము 1గంట వరకు సుమారు నాలుగున్నర గంటల పాటు ఏకధాటిగా చితకబాదారు. అనంతరం తీసుకొచ్చి రూములో పడేసి వెళ్లారు. అదే రూములోనే మరి కొంతమంది బిహారి యువకులు ఉండడంతో వారు సహచరులకు సమాచారం అందించి బాధితున్ని చికిత్స కోసం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో కోలు కుంటూ ఉన్నాడు.. ఘటనపై తాలూకా సిఐ కళా వెంకటరమణ కేసు విచారణ చేస్తున్నారు.

## స్కూల్ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

## విద్యార్థులు సురక్షితం

మహబూబాబాద్ తొర్రూరులో సెయింట్ పాల్స్ స్కూల్ బస్సు వేగంగా వచ్చి లారీని ఢీకొట్టింది. బస్సులో ఉన్న 50 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. పెద్ద ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భోజనానికి పిలిచి దారుణ హత్య.. పూజా గదిలో తల దాచిన కిరాతకుడు



ఒడిశాలోని బొలాంగీర్ జిల్లాలో ఆగస్టు 18న సంతోష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ప్రధాన నిందితుడు శత్రుఘ్న సాహూ, సహచరులు కలిసి అతన్ని భోజనానికి పిలిచి, నిద్రపోయాక హత్య చేశారు. అనంతరం తలను మొండెం నుంచి వేరు చేసి, గ్రామం వెలుపలి చెరువులో మృతదేహాన్ని పడేశారు. తెగిపోయిన తలను సాహూ ఇంట్లోని పూజా గదిలో దాచినట్లు పోలీసులు గుర్తించారు. భార్యను తిరిగి తెచ్చుకోవాలనే మూఢనమ్మకంతో నరబలికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో సాహూతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేశారు.

## వ్యాధి బారిన పడకముందే జాగ్రత్తలు తీసుకోవాలి- ఆచార్య మనీష్ ఆయుర్వేద వైద్యం

హైదరాబాద్ వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని ఆయుర్వేద నిపుణులు ఆచార్య మనీష్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు తాను,తన వైద్య బృందంతో కలిసి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో కిడ్నీ,లివర్,గుండె సంబంధిత వ్యాధులు,క్యాన్సర్, మధుమేహం,రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' కంటే 'ప్రివెన్షన్ ఈజ్ ది ఓన్లీ క్యూర్' అనే నినాదంతో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.

దేశవ్యాప్తంగా తమకు 120కి పైగా ఆయుర్వేద క్లినిక్కు, ఆసుపత్రులు,వెల్నెస్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్తో పాటు బెంగళూరు,చెన్నై,పాట్నా, కోల్కతా,ఢిల్లీ,ముంబై, చండీగఢ్,లూధియానా, డెహ్రాడూన్ తదితర నగరాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.తీవ్రమైన వ్యాధులకు సంబంధించి వ్యక్తిగత అనుభవాలను సాధారణ వైద్యపరమైన నిర్ధారణగా పరిగణించరాదని అర్హత కలిగిన వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు.వేల సంవత్సరాల క్రితమే ఆయుర్వేదంలో ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విధానాలను సూచించారని, పంచకర్మ వంటి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యాన్ని ఆరోగ్య పథకాల్లో మరింత విస్తృతంగా చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులు, సాధారణ ప్రజలకు ఆయుర్వేద చికిత్స అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య సలహాల కోసం హైదరాబాద్లో తమ ఆయుర్వేద కేంద్రం రాజ్భవన్ రోడ్,సోమాజిగూడలో ఉందని తెలిపారు.

# హెచ్ఐవి తో బాధపడుతున్న మహిళను అడవిలో వదిలేసిన కుటుంబం



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మానవత్వాన్ని మరిచిపోయిన ఘటన చోటుచేసుకుంది. హెచ్ఐవి తో బాధపడుతున్న ఒక మహిళను ఆమె కుటుంబసభ్యులు అడవిలో వదిలి వెళ్లిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. అనంతరం, ఆ మహిళను మహాదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు. 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించినప్పటికీ నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరీంనగర్ హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్తున్నామని చెప్పి కుటుంబసభ్యులు ఆ మహిళను అడవిలో వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది.

# పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


## న్యాయమూర్తి ఎన్ రెడ్డి ప్రసన్న, ధవలేశ్వరం ఎస్సై హరిబాబు

ధవలేశ్వరం. మహిళలు, చిన్నారులకు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఆఫ్ జువెనల్ జస్టిస్ బోర్డ్, రాజమహేంద్రవరం మెజిస్ట్రేట్ ఎన్. రెడ్డి ప్రసన్న, ధవలేశ్వరం ఎస్సై బి హరిబాబు తెలిపారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి కలెక్టరేట్ వెనక గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు బాలల చట్టాలు, పోక్సో యాక్ట్, ఇతర చట్టాలుపై అవగాహన, చదువుకునే దశలో పిల్లలు పాటించవలసిన నియమాలు, అపరిచిత వ్యక్తులతో పిల్లలు ప్రవర్తించవలసిన తీరు, ఈవ్‌టీజింగ్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనతో పాటు పీర్ ప్రెజర్‌కు లోనుకాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చిన్నారుల భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం వంటి పలు



అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని, విద్య మరియు భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, చిన్నారులు సురక్షితంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా పోలీస్ శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ధవలేశ్వరం ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సిబ్బందితో పాటు సుమారు మూడు వందల మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్య



వరంగల్ కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యచేసుకున్నాడు. వరంగల్ జిల్లా నర్సంపేట మల్లంపల్లి రోడ్డు లో కుటుంబ కలహాలతో ఇంట్లో మురళి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా కుటుంబ కలహాలతో ఆత్మహత్య కు పాల్పడ్డట్లు అనుమానిస్తున్నారు.

# రేపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన

**సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన బీజేపీ కార్యాలయ భవన శంకుస్థాపన**

**వేములవాడ మున్నూరు కాపు అన్నదాన సత్రం అదనపు గదుల ప్రారంభోత్సవం**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని గోపి పిలుపు**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ రేపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో మరియు వేములవాడ పట్టణంలో నిర్వహించే పలు కీలక కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ?పర్యటన వివరాల్లోకి వెళ్తే, రేపు ఉదయం 9:00 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు 1వ వార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కన నూతనంగా నిర్మించతలపెట్టిన భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయ భవన శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి పాల్గొంటారు. భూమిపూజ నిర్వహించి, పార్టీ కార్యాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుడతారు.

అనంతరం ఉదయం 10:00 గంటలకు వేములవాడ పట్టణ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ శ్రీ రాజరాజేశ్వర మున్నూరు కాపు నిత్య అన్నదాన సత్రం భవనానికి సంబంధించి నూతనంగా నిర్మించిన అదనపు గదులను బండి సంజయ్ ప్రారంభించనున్నారు. ?ఈ రెండు ముఖ్యమైన కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. ఉదయం నుంచే నిర్వహించే ఈ కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు సమయపాలన పాటించి నేరుగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రమ్య గ్రౌండ్ అలానే గోకుల్ ప్లాట్స్‌లో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

**రక్తదానంతో చిరంజీవికి అభిమానుల ప్రత్యేక కానుక..**

**మెగా బ్లడ్ క్యాంప్‌లో అభిమానుల రక్తదానం..**

**అన్నదానానికి భారీ స్పందన..**

**కూకట్‌పల్లి (ప్రజాబలం)ఆగస్టు 22:** ఎలాంటి సినీ నేపథ్యం, వారసత్వం లేకున్నా తన ప్రతిభ, కృషి, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి తెలుగు చిత్ర పరిశ్రమలో మెగాస్టార్‌గా కోట్లాది మంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన చిరంజీవి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదినాన్ని పురస్కరించుకుని చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రమ్య గ్రౌండ్‌లో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అభిమానుల కోలాహలం మధ్య జరిగిన కార్యక్రమంలో మెగా బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమం చేపట్టారు.



అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భారీ స్పందన లభించగా వేలాది మంది ప్రజలు హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ.ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి మహానటులు తెలుగు సినీ రంగాన్ని ఏలుతున్న సమయంలో చిరంజీవి తనదైన ప్రత్యేక నటన, అద్భుతమైన నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని సినీ పరిశ్రమలో కొత్త ఒరవడిని సృష్టించారని పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా చిరంజీవి ప్రజలకు ఎంతో చేరువయ్యారని కొనియాడారు.

చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఎందరో ప్రాణాలకు అండగా నిలిచారని, రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. తమ అభిమాన నటుడి స్ఫూర్తితో అభిమాన సంఘాలు కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని తెలిపారు.కష్టాన్ని నమ్ముకుని, తన ప్రతిభను ఆయుధంగా చేసుకుని అగ్ర నటుడిగా ఎదిగి మెగాస్టార్‌గా నిలిచిన చిరంజీవి జీవిత ప్రయాణం నేటి యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని బండి రమేష్ అన్నారు. సినీ రంగంలో ఎన్నో విజయాలు సాధించడమే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవడం చిరంజీవి ప్రత్యేకత అని పేర్కొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో కేక్ కట్ చేసి వేడుకలు

చిరంజీవి 71వ పుట్టినరోజు సందర్భంగా గోకుల్ ప్లాట్స్ పార్క్ వద్ద కూడా అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చిరంజీవి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువత, కాలనీ పెద్దలు, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అభిమానులు మెగాస్టార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు.రమ్య గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో గంధం రాజు, రంగమోహన్, సాయిబాబా చౌదరి, అరవింద్ రెడ్డి, తూము మనోజ్, ఎల్. రాజా, నళిని కాంత్, కిలారి శ్రీనివాస్ బాబు, చావా శ్రీనివాస్, మస్తాన్ రెడ్డి, శివ చౌదరి, హరి ప్రసాద్ నాయుడు, గోపాల్ చౌదరి, కామినేని వాసు, సుజాత, వాణి, జావ్వాడ అనిల్ కుమార్, సుబ్బారావు, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో జరిగిన వేడుకల్లో దుర్గారావు, అనిల్ కుమార్, గంధం రాజు, రంగమోహన్, తోట రమేష్, వసంతనగర్ డివిజన్ అధ్యక్షుడు కిలారు శ్రీనివాస బాబు, మురళి, కృష్ణమూర్తి, ఆదినారాయణ, సత్యనారాయణతో పాటు మహిళలు, యువత, చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్.కృష్ణయ్య పోరాటం బిసి రెజర్వేషన్స్ కు సోపానం

### బిసిలకు రాజ్యాధికారం రావాలంటే కృష్ణయ్య స్ఫూర్తి తో ముందుకు కదలాలి

### బిసి. ఎస్టి .మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ .ఖదీర్ పిలుపు



హైద్రాబాద్ ఆగస్ట్ 22;బీ.సీ.ల రిజర్వేషన్ల హక్కుల కోసం గత 50 సంవత్సరాల నుండి బీ.సీ. జాతీయ అధ్యక్షుడు ఆర్ . ఆర్.కృష్ణయ్య నిరంతరం పోరాడుతున్న బీ.సీ. ప్రజల్లో చైతన్యం రాకపోవడాన్ని ప్రతి ఒక్క బిసి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే

బీ.సీ. ప్రజల్లో క్షేత్రస్థాయి 33 జిల్లాలలో ఆర్థికంగా ఉన్న బలమైన నాయకులను, యువకులను ముందుండి నడిపించి ప్రతి గ్రామ గ్రామాలలో బీ.సీ. చైతన్యము తీసుకొచ్చి గ్రామాలలో సభలు పెట్టి ప్రతి మండలానికి ప్రతి గ్రామానికి బీ.సీ. అధ్యక్షులని నియమించిన ఘనత ఆర్.కృష్ణయ్యది.నేడు బీ.సీ.లలో చైతన్యం వచ్చి బీ.సీ.ల కోసం పోరాటం జరుగుతుంది. ప్రతి పౌరుడు తమ తమ హక్కులను పొందగలరు .అందుకే ప్రతి గ్రామంలో బీ.సీ.లలో చైతన్యం రావాలి ముందుకు సాగి ఒక రణరంగంగా బయలుదేరి ప్రభుత్వాన్ని నిలదీసినప్పుడే బీ.సీ. రాజ్యం ఏర్పడుతుంది. అప్పటివరకు బీ.సీ. రాజ్యం ఏర్పడడం చాలా కష్టం బీసీలందరూ ఏకమై పోరాడితే తప్ప ఎవరికి వారు తమ సొంత బీ.సీ. నినాదాన్ని వినిపిస్తున్నారు అలా కాకుండా బీ.సీ. సంఘాలు బీ.సీ. ప్రజలందరూ కలిసికట్టుగా ఉద్యమించినప్పుడే బీ.సీ . రాజాధికారం ఏర్పడుతుంది . ఆర్.కృష్ణయ్య బిసి ఉద్యమాలను బలహీన పరచడానికి కొన్ని రాజకీయ శక్తులు పనిగట్టుకొని బిసి లను విభజించి పాలలించే విధానాన్ని అవలంబిస్తున్నదున కొందరు వారి ప్రలోభాలకు లొంగి అసలు ఉద్యమ స్ఫూర్తిని నీరు గార్చుతున్నారు.అలాంటి వారిని బిసిలు తిప్పి కొట్టాలని .బిసి. ఎస్టి .మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ .ఖదీర్ పిలుపునిచ్చారు.

బీ.సీ.లు బలహీనులు అయితే బీ.సీ.ల రాజ్యాధికారం రావడం చాలా కష్టం అవుతుంది. కావున బీ.సీ . కుల సంఘాలు బీ.సీ. ప్రజలు మహిళలు యువకులలో ఎప్పుడైతే చైతన్యం వచ్చి ఉద్యమించినప్పుడే బీ.సీ . రాజ్యాంగం ఏర్పడుతుంది . బీ.సీ. కులస్తులందరూ ముందుకు సాగాలని బి.సి. ఎస్టి .మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ .ఖదీర్ పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చిన ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడిన బీ.సీ.ల యొక్క రాజకీయ పరిస్థితులలో ఆశించిన మార్పు రావట్లేదు బీ.సీ.ల యొక్క ఓట్లు అత్యధిక ఉన్నా బీ.సీ. ప్రజలలో ఎందుకు చైతన్యం రావట్లేదు అర్థం కాని పరిస్థితిలో ఉంది. కృష్ణయ్య స్ఫూర్తి తోబీ.సీ. కులాలు అందరూ తలచుకుంటే ఈరోజు అట్టహాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు నని ఎం.ఏ . ఖదీర్ పేర్కొన్నారు.

# రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం సరికాదు

### ఇది సమాజాన్ని చీలిస్తుంది.

### ప్రతి ఘటన ఉద్యమాలు తప్పదు

### జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

హైద్రాబాద్ ఆగస్ట్ 22;రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం సరికాదని,ఇది సమాజాన్ని చీలిస్తుందనిజాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు.ఇకముందు రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం కొనసాగిస్తే ప్రతి ఘటన ఉద్యమాలు తప్పదని హెచ్చరించారు.శనివారం బిసి భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ నిన్న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద అగ్రవర్ణాలవారు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం అన్యాయం – దుర్మార్గం. ఈ ఉద్యమాల ఆటలు కొనసాగునివ్వం. మానుకోకపోతే ప్రతి ఘటన ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నామన్నారుఈ దేశంలో 90 శాతం ఉన్న బీసీ/ ఎస్సీ/ ఎస్టీలను కొన్ని వందల సంవత్సరాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో అణిచి వేశారు. స్వతంత్రం తర్వాత రిజర్వేషన్లు పెట్టిన తర్వాత ఇప్పుడిప్పుడే ఈ కులాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ కులాలు అభివృద్ధి చెందుతుంటే అగ్రకులాలు ఓర్వలేక రిజర్వేషన్లపై

ఈర్ష అసూయలతో రగిలిపోతున్నారు.

సమ సమాజం – సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు పెట్టారు. రిజర్వేషన్లు పెట్టిన తర్వాత కొంత ప్రగతి ప్రారంభమైంది. బీసీలకు కేంద్రంలో రిజర్వేషన్లపై 34 సంవత్సరాలు నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీల శాతం 19 శాతం దాటలేదు. దేశ జనాభాలలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు 19 శాతం దాటలేదంటే ఇంకా అన్యాయం జరుగుతూనే ఉంది. కేంద్రంలో 100 సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఉంటే బీసీలు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. అలాగే సీనియర్ గ్రేడ్ 1 అధికారులలో బీసీల శాతం మూడు శాతం దాటలేదు. అలాగే బ్యాంకు డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు ప్రభుత్వ రంగ సంస్థలలో ఉన్నత స్థాయి అధికారులు బీసీలకు శాతం ఇప్పటికే ఒక శాతం దాటలేదు. ఇప్పటి ఈ దేశం బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుంది.

ఇది ప్రజాస్వామ్య దేశం. పైగా ఈ సమాజం కుల పునాదులపై నిర్మించబడింది. భారతీయ సమాజంలో ఆర్థిక – సామాజిక అసమాతలకు కులం – కుల వృత్తిలే కారణం. ఈ అసమానతలు తొలగాలంటే రిజర్వేషన్లు కొనసాగించక తప్పదన్నారు.

పైగా ఈ దేశంలో అనేక సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగం, పేదరికం, కుల వివక్ష, అవినీతి వీటిపై పోరాటాలు చేయకుండా యువతలో ఉన్న పోరాట పటిమను – స్ఫూర్తిని దారి మళ్లించి యువతతో ఉద్రేకాలు రెచ్చగొట్టడం సరికాదు.

ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో భారత దేశం అగ్ర దేశం వైపు ప్రగతిస్తుంది –. పరుగులు తీస్తుంది. ఇలా అంటే సరైన



కాలంలో సమాజాన్ని చీల్చి ప్రయత్నాలు కుట్రలు చేయడం సరికాదు. దేశాన్ని బలహీన పరచడం సరికాదు.

రిజర్వేషన్ వ్యతిరేకులు – ఉద్యమాలు ఆపండని హితవు పలికారు.

అగ్రకుల సోదరులు బీసీ/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తే ప్రతి ఘటన ఉద్యమాలు అంతకంటే భారీ ఎత్తున చేస్తాము. గతంలో మన రాష్ట్రంలో వచ్చిన 1986 ఉద్యమం, 1990లో వచ్చిన మండల కమిషన్ ఉద్యమం సందర్భంగా అగ్రకులాలు రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం చేశాయని అప్పుడు బి.సి.లు యూనివర్సిటీలను ఖాళీ చేయించి తరిమి – తరిమి కొట్టి పంపాము. ఇప్పుడు కూడా అదే పునారావృతం అవుతుందని హెచ్చరిస్తున్నామన్నారు.ఈ సమావేశం లో చేరుకుల రాజేందర్,ఆనంతయ్య.బాకీ రవి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బేగం బజార్ మర్వాడి మంచ్ లో ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్




హైదరాబాద్ఆగస్ట్22 ; ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మార్వాడీ మంచ్ బేగం బజార్ లో నేడు ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ నిర్వహించారు

ఈ శిబిరంలో ఆర్గనైజషన్ వారికీ ఉచితంగా రక్త గ్రూపింగ్ పరీక్షలు 50 మందికి నిర్వహించి, వారి రక్త గ్రూపులను తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త గ్రూప్ సమాచారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారికి అవగాహన కల్పించారు.

ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో అవసరమైన సమయంలో రక్త గ్రూప్ సమాచారం సులభంగా అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరికి తన రక్త గ్రూప్‌ను తెలుసుకోవడం అవసరమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్వాడీ మంచ్ యాజమాన్యం, , సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది మరియు వాలంటీర్లు పాల్గొని క్యాంప్‌ను విజయవంతం చేశారు.

ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆరోగ్య అవగాహనలో భాగంగా ఇలాంటి ఉచిత బ్లడ్ గ్రూపింగ్ క్యాంపులు, వైద్య శిబిరాలు మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోన్నట్లు డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎక్సగ్యుటీ డైరెక్టర్ జి.మాధవి తెలిపారు.

# కార్మికుల ప్రాణాలకు భద్రత ఎప్పుడు?

## (-- హెచ్. ప్రతాప్)

పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది. పెట్టుబడులు వస్తే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కానీ ఆ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచే కార్మికుల ప్రాణాలకే భద్రత లేకపోతే ఆ ప్రగతికి అర్థమేంటి? యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దొత్తిగూడెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఔషధ పరిశ్రమ రియాక్టర్ పేలుడు ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది. పోలీసుల ప్రకారం ఇద్దరు కార్మికులు మృతి చెందగా, తొమ్మిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి 50 శాతానికి పైగా కాలిన గాయాలయ్యాయి. పేలుడు అనంతరం చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ విషాదానికి ఏడాది క్రితం జరిగిన మరో ఘోర పారిశ్రామిక ప్రమాదం నేపథ్యంగా కనిపిస్తోంది. 2025 జూన్ 30న సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి పరిశ్రమలో భారీ పేలుడు, అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో చివరకు 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది కార్మికులు ఉన్నట్లు నమోదైంది. తరువాత ప్రభుత్వ దర్యాప్తులో అగ్నిమాపక భద్రత, అత్యవసర సన్నద్ధత వంటి అంశాలపై తీవ్రమైన లోపాలు గుర్తించినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

ఈ వరుస ఘటనలు ఒక కీలక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం, ఉత్పత్తి సామర్థ్యం పెంచడం ఎంత ముఖ్యమో ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి నివారించడం అంతకంటే ముఖ్యం. ముఖ్యంగా ఔషధ, రసాయన పరిశ్రమల్లో రియాక్టర్లు, ఉష్ణోగ్రత--పీడన నియంత్రణ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ప్రమాదకర పదార్థాల నిర్వహణ, కార్మికుల శిక్షణపై నిరంతర తనిఖీలు జరగాలి.

తనిఖీలు కేవలం పత్రాల పరిశీలనకే పరిమితం కాకూడదు. పరిశ్రమ నడుస్తున్న వాస్తవ పరిస్థితుల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అన్నదే అసలు ప్రశ్న. లోపాలు బయటపడితే సరిదిద్దే వరకు కార్యకలాపాలను నిలిపివేసే విధానం ఉండాలి. ప్రతి ప్రమాదం తర్వాత విచారణ, పరిహారం అనే పద్ధతికి బదులుగా ప్రమాద నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పరిశ్రమల అభివృద్ధి తెలంగాణ ఆర్థిక ప్రగతికి అవసరం. కానీ ఆ ప్రగతికి కార్మికుల ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సిన పరిస్థితి రాకూడదు. పెట్టుబడులను రక్షించే భద్రతా వ్యవస్థతో పాటు, పెట్టుబడులకు ప్రాణం పోసే కార్మికులను రక్షించే వ్యవస్థ కూడా బలపడినప్పుడే పారిశ్రామిక ప్రగతి నిజమైన అభివృద్ధిగా మారుతుంది.

# నిరుపేదల ఇళ్ల కోసమే నా పోరాటం అది సాధించి వాళ్ళకి న్యాయం అయ్యేంతవరకు పోరాడుతా!!! సంగీత



**మియాపూర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఆగస్టు 22** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ శేరి లింగంపల్లి ఇన్చార్జి సంగీత ఆధ్వర్యం లో మియాపూర్ బిబియు వద్ద ఏర్పా టుచేసిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ.నియోజకవర్గ పరిధిలోని వందలాదిమంది నిరుపేదలు దీర్ఘకా లంగా వివిధ కూలి పనులు చేస్తూ

సొంత ఇంటి కల నాటి నుండి నేటి వరకు నెరవేర్చకపోవడం అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ కడుహీనంగా బతుకు బండిని నెట్టుకుంటూ వెళ్తుండడం ఎంతో బాధని కలిగిస్తుందని ఆమె పేర్కొన్నా రు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లకు సైతం గత కొన్ని సంవత్సరాలుగా తనతో కలిసి అనేక పోరాటాలలో పాల్గొంటున్న మహి ళలు పురుషులు ఈ హైదరాబాద్ నగ రంలో సెంటు భూమి కూడా కొనలేని పరిస్థితిలో ఉన్నారన్న విషయమై వీళ్లకు మేలు చేయాలన్న ఉద్దేశంతో పలు కార్యాలయాలకు తమ సొంత ఖర్చుల ను భరించుకుంటూ ఆయా సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి తమ సమస్యకు పరిష్కారం చే యాలని వారికి వివిధ రకాల వినతి పత్రాలను ఇప్పటికే అంద జే సినట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సంద ర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలలో ఉన్న మహిళలను ఏకతాటి పైకి తీసుకొస్తూ,వారిని మరింత చైతన్యవంతులుగా తయారు చేయడాని కి ప్రస్తుతం ఇదే పార్టీ నుంచి నేడు అసోసి యే షన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యవర్గ వివరాలు ఇలా ఉన్నాయి. అధ్యక్షులుగా జి.నిర్మ ల,ఉపాధ్యక్షులుగా శోభ,కార్యదర్శి దీపిక, సంయుక్త కార్యదర్శి ఆర్,సత్య. కోశాధికారిగా మల్లేశ్వరి,కార్యవర్గ సభ్యులుగాపీ.సంగీత,శాంతాబాయి, సమీర్ బేగం,మున్ని బి.తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారుల వేధింపులు తట్టుకోలేక పోడు రైతు పెట్రోల్ డబ్బాతో కుటుంబ సభ్యులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 22 ఏటూరునాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని గూగుపల్లి అడవి ప్రాంతంలో 10 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని ఏటూరు నాగారం రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తోటి సిబ్బందితో మూడు జేసిపిలతో పాటి ప్రశాంత్ సాగు చేసుకుంటున్న భూమిలో కందకాలు తీసే ప్రయత్నం చేస్తుండగా ఫారెస్ట్ అధికారులను నిలదీసి నేను 10 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూమి కొత్త పోడు కొట్టకుండా పాతదానిలోనే సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నానని ఆవేదన చెందాడు ఫారెస్ట్ అధికారులు తన మాట వినకపోవడంతో పెట్రోల్ తీసుకుని వచ్చి తన సాగు చేసుకున్న పొలంలో పోసుకొని కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు దీనితో చుట్టుపక్కల రైతులు అక్కడికి చేరుకొని ఫారెస్ట్ అధికారులు చేస్తున్న కందకాలను వెంటనే ఆపాలని లేకపోతే పెద్ద ఎత్తున కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని అన్నారు పాటి ప్రశాంత్ అడవి శాఖ అధికారులు నా పొలంలో కందకాలు తీస్తే నా చావుకు ఎటురూ నాగారం రేంజ్ ఆఫీసర్ అబ్దుల్ రహ్మాన్ కారకూడని అన్నా డు

# రూ.28.14 కోట్ల పెట్టుబడుల మోసం

## అధిక లాభాల ఆశ చూపి మోసం.. నలుగురు అరెస్టు




**జహీరాబాద్, ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి:** అధిక లాభాలు వస్తాయని నమ్మించి బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టించిన 'నేకీ ట్రేడర్స్' నిర్వాహకులు రూ.28.14 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు జహీరాబాద్ టౌన్ సీఐ ఆర్.రవి తెలిపారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సీఐ కథనం ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన మిదిదొడ్డి ఇజ్రాయేలు అలియాస్ బాబీ, కొత్త శశిధర్‌రెడ్డి సహా మరో 24 మంది గత రెండేళ్లుగా హైదరాబాద్‌లోని నేకీ ట్రేడర్స్‌లో సుమారు రూ.28,14,57,128 పెట్టుబడులు పెట్టారు. తొలుత కొన్ని నెలలపాటు పెట్టుబడులకు వడ్డీ చెల్లించి బాధితుల్లో నిందితులు నమ్మకం కలిగించారు. దీంతో బాధితులు మరింత పెద్ద మొత్తంలో వివిధ లావాదేవీల ద్వారా పెట్టుబడులు పెట్టారు. అనంతరం పెట్టుబడులకు ఎలాంటి రాబడి ఇవ్వకుండా మోసం చేసినట్లు సీఐ వివరించారు.

ండు కేసులు నమోదు

బాధితులు మిదిదొడ్డి ఇజ్రాయేలు అలియాస్ బాబీ, కొత్త శశిధర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జహీరాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ లవకుమార్, పోలీసు సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

నలుగురు అరెస్టు

ఈ కేసులో మల్లెం శేషువర్ధనరెడ్డి అలియాస్ శశువర్ధన్‌రెడ్డి (39), బగ్గి రవీంద్రబాబు అలియాస్ రవీందర్ (45), దేవుల జగదీశ్ (36), పిండి సుష్మిత (39)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆర్.రవి వెల్లడించారు.

# ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురండి

### సానుకూలంగా పరిష్కరిస్తా

### మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:**వైరా మున్సిపాలిటీ పరిధిలో వార్డులలో ఏ సమస్య వచ్చినా దాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన



చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు వైరాలోని 12.13 వ వార్డులలో బ ం ం ద ం వ ం య ం ం ం తో గుంతలతోనిండినరహదారులను మరమ్మత్తు పనులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మా పరిధిలో ఉన్న ప్రతి పనిని చేయటానికి ప్రయత్నిస్తానని అదే విధంగా సత్రం బజారులో ఈ 12 13 వార్డులో కలిపి ఉన్న రహదారికి త్వరలో టెండర్లు పూర్తవుతాయని పర్మినెంట్గా సిమెంట్ రోడ్డు వేయడానికి చర్యలు మున్సిపాలిటీ తీసుకుంటుందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు ఆయా వార్డులలో ఉన్న ప్రజలు తమ వంతు బాధ్యతగా వ్యవహరించి సమస్యను సానుకూలంగా పరిష్కరించే దిశగా ఉండాలని అదేవిధంగా వైరా మున్సిపాలిటీ కూడా ప్రజల సహకారం కూడా అవసరమని ప్రతి ఇంటి యజమాని తమ తమ ఇంటి పనులను సకాలంలో చెల్లించి వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం వార్డు యువకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ రహదారి పరిష్కారం లేక మరుగున పడిపోయిందని వర్షం వస్తే నీళ్లు ఇళ్లల్లోకి చేరి నానా ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు ఇప్పటికైనా నూతన పాలకమండలి మా సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించాలని రహదారికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు మా వార్డుల సమస్యను మున్సిపల్ అధికారులకు చైర్పర్సన్ కు తీసుకురాగానే కొంతలో కొంతైనా సమస్య పరిష్కరించినందుకు గ్రావెల్ తో మరమ్మత్తులు చేసి చేపట్టినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాప చంద్రకళను మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. అనంతరం మున్సిపల్ ఏఈ రహదారి పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కాప మురళీకృష్ణ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి టౌన్ అధ్యక్షులుగా ఎస్.కె బాజీ నియామకం




**సత్తుపల్లి ఆగస్టు 22 ప్రజాబలం :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి టౌన్ అధ్యక్షులుగా కోమేపల్లి కాలనీకి చెందిన ఎస్. కె బాజీ నియమితులయ్యారు.

శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ఉప్పు హనుమంతరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ ఎస్.కె బాజీకి నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల హక్కులు, సంక్షేమం కోసం సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సత్తుపల్లి పట్టణంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేస్తూ, బీసీల సమస్యల పరిష్కారానికి ఎస్.కె బాజీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జ్ మరీదు ప్రసాద్, రజక సంఘం సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు విరివాడ నాగభూషణం, యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కోమటి తిరుమలరావు, విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తమ్మిశెట్టి గణేష్, దేవుళ్ళ శీను, బీసీ సంఘం నాయకులు షేక్ ఖలీల్, రహీం, ఖాదర్ బాబా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.

### భారత ఎన్నికల సంఘం కార్యదర్శి.

### :: నవీన్ కుమార్, కార్యదర్శి, భారత ఎన్నికల సంఘం.

**ములుగు జిల్లా ప్రజలను ప్రతినిధి ఆగస్టు 22 ములుగు**శనివారం ములుగు జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నవీన్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఓటర్లకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బీఎల్ఓల పనితీరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.




ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో చేపడుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చల్వాయి గ్రామ ప్రజలతో కూడా ఆయన ప్రత్యక్షంగా మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. బీఎల్ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఏఈఆర్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, కేవలం కార్యాలయ స్థాయి సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరు, ఓటర్లకు అందుతున్న సేవలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నవీన్ కుమార్, కార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఢదే హేమంత్ సహదేవరావుతో కలిసి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ--2026 పురోగతిపై ఏఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్‌గా నమోదైన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

109--ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,01,964 మంది పురుషులు, 1,07,143 మంది మహిళలు, 21 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 11,308 నో మ్యాపింగ్ కేసులు, 30,326 అనామలీస్ కేసులు కలిపి మొత్తం 41,634 కేసులు ఉన్నాయని అధికారులు వివరించారు. వీటిపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

నో మ్యాపింగ్, అనామలీస్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో వాస్తవ పరిస్థితిని నిర్ధారించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని నవీన్ కుమార్ సూచించారు. ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరుకు అందుబాటులో ఉండాలని, ఓటర్ల జాబితాలో వివరాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఏఈఆర్ఓలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని, ఓటర్ల జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, 10 మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు సలీం, డిటి నితీష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మార్పల్లి మండలంలో దళిత మహిళపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం: నాయకుల తీరుపై ఆగ్రహం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మార్పల్లి మండలం, కొంషెట్ పల్లి గ్రామంలో దళిత మహిళపై సర్పంచ్ మరియు అతని అనుచరులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని స్థానిక బాధితులు, దళిత సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు3 8 26న దాడి జరిగినఇప్పటివరకు స్పందన లేదు.

జాతీయ స్థాయి నాయకుడు రాహుల్ గాంధీ న్యాయం కోసం పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేసినప్పుడు స్పందించిన రాజకీయ నాయకులు, మన సొంత మండలంలోని కొంషెట్ పల్లిలో ఒక దళిత మహిళపై బహిరంగంగా దాడి జరిగితే ఎందుకు నోరు విప్పడంలేదని ప్రశ్నించారు. ఈ ఘటనపై అటు నాయకులు గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకోకపోవడం లేదు ఇది దారుణమని మన్నె సుధాకర్ యాదవ్ మండిపడ్డారు.

సర్పంచ్, ఆయన అనుచరులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మహిళపై దాడికి పాల్పడినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. బాధితురాలికి వెంటనే న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన సర్పంచ్ మరియు అతని అనుచరులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మన్నే సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు

# మణికొండ – ఓయూ కాలనీ రోడ్డు విస్తరణకు తక్షణ చర్యలు చేపట్టాలి.







**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 22 ఆగస్టు 2026**శనివారం రోజున మణికొండ ప్రజా ఐక్య వేదిక కన్వీనర్ సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో మణికొండ మరియు పరిసర కాలనీలకు చెందిన ప్రజలు మర్రిచెట్టు వద్ద సమావేశమై నిత్యం తీవ్రంగా పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు మర్రిచెట్టు – ఓయూ కాలనీ రోడ్డు సాధారణ సమయాల్లోనే ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉండగా, పీక్ అవర్స్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, వాహనదారులు, పాదచారులు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ముఖ్యంగా అంబులెన్స్‌లు, ఫైర్ టెండర్లు వంటి అత్యవసర సేవల వాహనాలు కూడా సులభంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, తక్షణమే రహదారిని విస్తరించాలని డిమాండ్ చేస్తూ, ఈ రోడ్డుపై పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి సామర్థ్యాన్ని పెంచాలని, ప్రత్యామ్నాయ మార్గాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అన్యథా ప్రజల భద్రతకు తీవ్ర ముప్పుగా రహదారి మారిందని ప్రజా ఉద్యమంగా ఓ.యూ కాలనీ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. అందులో భాగంగా రహదారికి, పాదచారుల మార్గాలకు అడ్డుగా ఉన్న అన్ని విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించి పాదచారులు సురక్షితంగా, నిర్బంధం లేకుండా నడిచే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం ప్రజా పన్నుల డబ్బుతో దాదాపు 10 కోట్ల వ్యయంతో నిర్మించిన ట్రైల్స్ రోడ్ నంబర్ 10, పంచవటి కాలనీ బాక్స్ డ్రెయిన్ కమ్ రహదారి ప్రజా ఆస్తి అట్టి రోడ్డు కాస్తా ఒక బిల్డర్ వినియోగానికి వదిలేయడం ఎంతమాత్రం సమంజసం కాదు, వెంటనే ప్రజల వినియోగంలోకి తీసుకు రావాలి. శివపురి నుంచి చిత్రపురి వరకు జనచైతన్య కాలనీ మీదుగా ప్రత్యామ్నాయ రహదారిని నిర్మింస్తే ప్రస్తుత రహదారీపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది మరియు ఇదే రోడ్డులో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కార్యాలయాన్ని తరలించి, అదనపు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. చట్టపరంగా వినియోగించ దగిన అన్ని సెట్బ్యాక్‌లను రోడ్డు విస్తరణ కోసం మాత్రమే వినియోగించాలి. వాటిని వాణిజ్య పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించడం ద్వారా రహదారి అందుబాటులో ఉన్న వెడల్పును మరింత తగ్గించకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ డిమాండ్లన్నింటినీ స్పష్టమైన కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక ద్వారా అమలు చేయాలి. ప్రతి అంశానికి సంబంధిత అధికారులను బాధ్యులుగా నిర్ణయించి, పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రజా రహదారులు, ప్రజల డబ్బుతో నిర్మించిన ఆస్తులు నిరుపయోగంగా ఉండటం ఆమోదయోగ్యం కాదు. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు ప్రారంభించకపోతే, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అవసరమైతే రాస్తా రోకో కార్యక్రమం చేపట్టి ప్రజల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వెనుకాడబోమని, త్వరలో ఈ సమస్యను ముందుకు తీసుకెళ్లేందుకు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసేందుకు మరియు డిమాండ్ల అమలు కోసం నిరంతరం పోరాడేందుకు ఒక ప్రత్యేక యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## చిరాగ్‌పల్లి శివారులో రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి


జహీరాబాద్, ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి: చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. సత్వార్ నివాసి కలకోడ మనన్ తన భార్య తస్లీమ్ బేగంతో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్ పై ఎన్‌హెచ్‌--65 మీదుగా మన్నేకెల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో రాత్రి సుమారు 9 గంటల సమయంలో చిరాగ్‌పల్లి గ్రామ శివారులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. తస్లీమ్ బేగం అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ వైద్యులు నిర్ధారించారు. కలకోడ మనన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

## రాయిపల్లి తండాలో అక్రమ బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

జహీరాబాద్, ఆగస్ట్ 22 ప్రజాబలం ప్రతినిధి: మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండాలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాప్‌పై చిరాగ్‌పల్లి పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాయిపల్లి తండాకు చెందిన శివలాల్ ఎలాంటి అనుమతులు లేకుండా కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందగా చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దుకాణంపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న శివలాల్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం తెలుగు రాష్ట్రాలకు ఐదు రోజుల పాటు వర్షాలు రైతన్నల కళ్లల్లో ఆశలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 22 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాష్ట్రాలలో రానున్న ఐదు రోజులపాటు అక్కడక్కడ వర్షాలుకురిసేఅవకాశంఉందని, వాతావరణ శాఖ వెల్లడించింది, తాజా వాతావరణ సూచనల ప్రకారం తెలంగాణలో వర్షాలకు ఎల్లో అలర్ట్ జారికాగా, కోస్తా ఆంధ్రాలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలకు అవకాశం ఉన్నట్లు సమాచారం, ఆగస్టు 22 నుంచి 27 వరకు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడవచ్చని, వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు,ఈసమయంలో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు, ఇటీవల తెలుగు రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలలో, లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో, ఈవర్షాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు, పంటలకు అవసరమైన సమయంలో వర్షాలు కురిస్తే సాగుకు కొంత ఊరటలభించే అవకాశంఉందని రైతులుఅభిప్రాయపడుతున్నారు,ప్రజలు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల ,సమయాలలో, చెట్లు విద్యుత్ స్తంభాల కింద, నిలబడకుండా సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, అధికారులు సూచిస్తున్నారు....

# విద్యా విజయం: సమాజం యొక్క పెరుగుతున్న విద్యా ఆకాంక్షలను వేడుక చేసుకోవడం

వివిధ కోచింగ్ సంస్థల మార్గదర్శకత్వంలో నీట్ 2026లో ముస్లిం విద్యార్థులు అసాధారణ మార్కులు సాధించడం కేవలం ఒక విద్యాపరమైన విజయమే కాదు; ఇది యావత్ సమాజానికి గర్వకారణం. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఎంతోమంది యువతకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులో లేని ఈ తరుణంలో, ఇటువంటి విజయ గాథలు భవిష్యత్తుకు ఆశను, స్ఫూర్తిని, ఒక మార్గసూచిని అందిస్తున్నాయి.

ఈ అద్భుతమైన ఫలితాలు విద్యార్థుల పట్టుదలను, వారి కుటుంబాల త్యాగాలను, అలాగే ప్రతిభను పెంపొందించడంలో తమ సమయాన్ని, నైపుణ్యాన్ని వెచ్చించిన విద్యావేత్తల అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. అంతకంటే ముఖ్యంగా, అవకాశాలు కల్పించి, సహాయక వ్యవస్థలను బలోపేతం చేసినప్పుడు, యువ మేధావులు అత్యుత్తమ ప్రతిభావంతులతో పోటీపడి జాతీయ స్థాయిలో రాణించగలరని ఇవి నిరూపిస్తున్నాయి.

సమాజానికి, ఈ విజయం పరీక్షా మార్కులకు మించిన ప్రాముఖ్యతను కలిగి ఉంది. సాధికారతకు, సామాజిక ఉన్నతికి శాస్త్రీయ విద్య అత్యంత శక్తివంతమైన సాధనం అనే పెరుగుతున్న గుర్తింపునకు ఇది ప్రతీక. వైద్య లేదా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి కేవలం ఒక వ్యక్తిగత విజయగాథగా మాత్రమే మిగిలిపోరు; అభ్యసనం ద్వారా తమ జీవితాలను మార్చుకోవాలని ఆకాంక్షించే లెక్కలేనంత మందికి వారు స్ఫూర్తిగా నిలుస్తారు.

ఇలాంటి విజయాలు కేవలం విడివిడి ఉదాహరణలుగా మిగిలిపోకుండా చూడటమే ప్రస్తుత అవసరం. సమాజం ఈ ఫలితాలను ఒక కార్యాచరణ పిలుపుగా చూడాలి. ఎక్కువ మంది యువత ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు మరియు పోటీ పరీక్షలు రాసేలా ప్రోత్సహించడానికి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థలు మరియు సమాజ నాయకులు సమిష్టిగా కృషి చేయాలి. ఏ సమాజ భవిష్యత్తు అయినా కేవలం దాని సంఖ్యల వల్ల మాత్రమే కాకుండా, అక్కడి యువతకు అందుబాటులో ఉన్న విద్య నాణ్యత, నైపుణ్యాలు మరియు అవకాశాల వల్ల రూపుదిద్దుకుంటుంది.

ఇటీవలి సంవత్సరాలలో, వైద్యం, ఇంజనీరింగ్, నిర్వహణ, న్యాయశాస్త్రం, పరిశోధన, పౌర సేవలు మరియు ఇతర వృత్తిపరమైన రంగాలలో కెరీర్‌లను అన్వేషించడం ప్రారంభించిన విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రోత్సాహకరమైన సంకేతాలు వెలువడ్డాయి. అయినప్పటికీ, ఇంకా చేయాల్సింది చాలా ఉంది. విద్యా అవగాహన ప్రతి ఇంటికీ చేరాలి, ముఖ్యంగా ఉన్నత విద్య ఆర్థికంగా లేదా సామాజికంగా అందుబాటులో లేదని భావించే కుటుంబాలలో ఇది మరింతగా అవసరం. ఇలాంటి విజయ గాథలు ప్రతిభ ప్రతిచోటా ఉంటుందని నిరూపిస్తాయి; తరచుగా కావలసింది మార్గనిర్దేశం, సలహాలు మరియు సరైన వనరులకు ప్రాప్యత.

సమాజంలో ఈ లక్ష్యం దిశగా పనిచేస్తున్న సంస్థలు, ఎంతో అవసరమైన ఈ మార్పును తీసుకువస్తున్నందుకు ప్రత్యేక ప్రశంసలకు అర్హమైనవి. వారి సహకారం కేవలం పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికే పరిమితం కాదు. వారు ఆశయం, క్రమశిక్షణ మరియు విద్యా నైపుణ్యంతో కూడిన ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించడంలో సహాయపడ్డారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి క్రమబద్ధమైన మార్గదర్శకత్వాన్ని అందించడం ద్వారా, ఈ సంస్థలు విద్యా అసమానతలను తగ్గించడంలో సహాయపడుతున్నాయి మరియు లేకపోతే మూసుకుపోయి ఉండే తలుపులను తెరుస్తున్నాయి.

ఇలాంటి కార్యక్రమాల ప్రభావం కేవలం పరీక్షా ఫలితాల్లోనే కాకుండా, ఆలోచనా విధానాలలో మార్పులో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. అవి యువతను సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా ఆలోచించేలా ప్రోత్సహిస్తాయి.

పరిమితులను అధిగమించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, విజయం సాధించగల తమ సామర్థ్యాన్ని విశ్వసించాలి. అంతే ముఖ్యంగా, విద్యపై పెట్టుబడి పెట్టడం వల్ల శాశ్వతమైన ప్రతిఫలాలు లభిస్తాయనే విశ్వాసాన్ని వారు కుటుంబాలలో మరియు సమాజాలలో పాదుకొల్పాలి.

జ్ఞానం, ఆవిష్కరణలు, నైపుణ్యం గల మానవ వనరులతో నడిచే భవిష్యత్తు వైపు దేశం పయనిస్తున్న తరుణంలో, ఉన్నత విద్యలో ప్రతి సమాజం యొక్క భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకం. విద్యాభివృద్ధి కేవలం ప్రభుత్వాలు, సంస్థల బాధ్యత మాత్రమే కాదనే విషయాన్ని ఈ నీట్ అభ్యర్థుల విజయం గుర్తుచేస్తుంది. ఇది కుటుంబాలు, సామాజిక సంస్థలు మరియు సమాజం యొక్క చురుకైన భాగస్వామ్యం అవసరమయ్యే ఒక సామూహిక ప్రయత్నం.

ఈ విద్యార్థుల విజయం అభినందనీయమైనది, కానీ అది విద్యా నైపుణ్యం దిశగా ఒక పెద్ద ఉద్యమానికి స్ఫూర్తినివ్వాలి. యువతకు సందేశం స్పష్టం: పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించండి, సంకోచం లేకుండా అవకాశాలను అందిపుచ్చుకోండి మరియు విద్యాపరమైన విజయం వ్యక్తిగత, సామాజిక పరివర్తనకు శక్తివంతమైన ఉత్ప్రేరకంగా మారగలదని గుర్తించండి.

ఈ ఘనత పట్ల సమాజం గర్వపడటానికి అన్ని కారణాలూ ఉన్నాయి. అంతకంటే ముఖ్యంగా, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లి, ఈ విద్యార్థుల విజయం రాబోయే తరాలకు మరింత గొప్ప విద్యా చైతన్యానికి నాంది పలికేలా చూసే అవకాశం ఇప్పుడు సమాజానికి లభించింది.

## బీబీఆర్ ఆసుపత్రిలో ఈహెచ్‌ఎస్ నమోదు ప్రక్రియ పరిశీలన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 22:**లి ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మేడ్చల్‌--మల్కాజ్‌గిరి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ శనివారం బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) కింద జరుగుతున్న నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈహెచ్‌ఎస్ పరిధిలో లబ్ధిదారులకు అందిస్తున్న వైద్య సేవలు, లబ్ధిదారుల నమోదు వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డా. కె. ఆనంద్ ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బందికి సూచించారు. నమోదు ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని, లబ్ధిదారులకు అవసరమైన వైద్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఈహెచ్‌ఎస్ సేవల అమలు తీరుపై ఆయన సిబ్బందితో సమీక్షించారు.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ



బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 – సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు.

లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.com మెయిల్ కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది.

ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ. లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు బీజేవైఎం మద్దతు



**జహీరాబాద్, ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు బీజేవైఎం నాయకులు మద్దతు తెలిపారు. కళాశాల నుంచి రంజోల్ ప్రధాన రహదారి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమ అనిల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బీజేవైఎం మాజీ అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్ మాట్లాడుతూ జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ చేయడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు అఖిలేష్ యాదవ్, ప్రవీణ్, పల్లె కార్తీక్, రాజు, పాండు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చిన్నారులకు ప్రాణదానం.

# నేడు బాలభారతిలో తలసేమియా రక్తదాన శిబిరం.




**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలోని బాలభారతి స్కూల్ నందు ఆదివారం నిర్వహించే రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరు పాల్గొని చిన్నారికి తమ రక్తాన్ని అందించాలని కోరారు. అతి చిన్న వయసులో అందరితో కలిసి ఆడుకోవాల్సిన వయసులో తలసేమియా అనే వ్యాధితో బాధపడుతూ రక్తదానం కోసం బాబు ఎదురుచూస్తున్నారు. మీరు ఇచ్చే రక్తం చిన్నారికి ప్రాణదానముల ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని రక్త దానం చేయాలని కోరారు. మీరు ఇచ్చే కొంచెం రక్తం తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారి ముఖంలో చిరునవ్వు చూసినట్లు సరికొత్త ఆశను నింపుతుంది. కావున బాబు పుట్టినరోజు వేడుక రక్తదాన శిబిరం ద్వారా నిర్వహించి బాబును ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని తల్లిదండ్రులు కోరారు.

# ఎట్టకేలకు అల్గోల్ రోడ్డు పనులు ప్రారంభం



**జహీరాబాద్, ఆగస్టు 22 ప్రజాబలం ప్రతినిధి:** అల్గోల్ ఎట్టకేలకు అల్గోల్ గ్రామ రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్డుపై మట్టి పోసి లెవలింగ్ పనులు చేపడుతున్నారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డు పనులు పూర్తయితే గ్రామ ప్రజల రాకపోకలకు సౌకర్యం కలగడంతోపాటు ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు తెలిపారు. రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పనులను సర్పంచ్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు అలోక్, ముబీన్, మాజీ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ బక్కన్న, గ్రామస్తుడు నరేష్ తదితరులు పరిశీలించారు.

# మెగా యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు

# శుభాకాంక్షలు తెలిపిన రాయల రాము




**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** తల్లాడ మండల కేంద్రంలో మెగా యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా సత్తుపల్లి నియోజకవర్గం బిఎల్ఎ ల ఇంచార్జి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము పాల్గొన్నారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు ఈ సందర్భంగా రాయల రాము మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషితో తన సినీ ప్రస్థానం కొనసాగించి ఇండస్ట్రీకి పెద్ద దిక్కుగా నిలిచారన్నారు ఈ సందర్భంగా మెగాస్టార్ సినీ ప్రస్థానం గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండలం మాజీ జడ్పిటిసి మూకర ప్రసాద్, మంగాపురం ఉప సర్పంచ్ గుజ్జర్ల పూడి చింటూ, వేమిశెట్టి శంకర్, మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ..

## దర్యాప్తులో చిన్నపాటి లోపాలకు కూడా తావులేకుండా చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఈగల్ ఫోర్స్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నాడు కొత్తగూడెం ఐఎంఈ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేశారు.





శిక్షణలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల గుర్తింపు, అరెస్టు, సీజ్ ప్రక్రియ, పంచనామా, సాక్ష్యాల సేకరణ, కేసు దర్యాప్తు, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాల్లో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

అదేవిధంగా ఎన్‌డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్లు, వాటి అమలు విధానం, కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే అంశాలు, దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాక్ష్యాధారాల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. దర్యాప్తులో చిన్నపాటి లోపాలు కూడా కోర్టు విచారణ సమయంలో న్యాయపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున, ప్రతి దశలోనూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో కేసులను దర్యాప్తు చేయాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు సూచించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మాట్లాడుతూ దర్యాప్తులో చోటుచేసుకునే లోపాలను గుర్తించి వాటిని సవరించుకోవడంతో పాటు, కేసుల పురోగతిపై పోలీసు అధికారులు శిక్షణలో తెలియజేసిన సూచనలు పాటించాలని సూచించారు. ప్రతి కేసులోనూ దర్యాప్తు అధికారులు చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, పక్కా ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా శిక్షణా తరగతులు నిర్వహించి పోలీసు అధికారులకు, సిబ్బందికి చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎల్.హెచ్. రాజేశ్వరరావు, ఫణి కుమార్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సన్మానించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్.సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తాం:

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

శనివారం మంత్రి ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎస్పీ అఖిల్ మహాజన్ పూల మొక్కలు అందించి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్‌ను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్యానెల్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద, గిరిజన విద్యార్థులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, శారీరక దారుఢ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, జూంబా, ఏరోబిక్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

**ఉన్నత స్థానాలకు ఎదగాలి: ఎమ్మెల్సీ దండే విఠల్**

ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, పేద, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి కలెక్టర్లు, ఇంజనీర్లు, వైద్యులు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్, గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందిస్తూ అనేక మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ సదుపాయాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**పాఠశాలల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వం కల్పిస్తున్న డిజిటల్ బోర్డులు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర ఆధునిక సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులు ఇటీవలి కాలంలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆశ్రమ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఫ్లీచీ) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు క్రమం తప్పకుండా శిక్షణ, నెలవారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.

విద్యార్థుల పోషకాహార స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఉమ్మడి జిల్లా ఐటీడీఏ పరిధిలోని 400కు పైగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ. 20 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ సిబ్బంది కొరత, అత్యవసర ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉట్నూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న 'వికాసం స్కూల్' ను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, ఆరోగ్యం, పోషకాహారం అందించి వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఇతర అధికారులు విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, కిట్లను పంపిణీ చేశారు.

అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు సహపంక్తి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సంతోష్, ఎస్ఈటిడబ్ల్యూ ఫణికుమారి, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, ఆర్డీఓ మోహన్ సింగ్, డి. ప్రేమకళ, డీటీడీఓలు అంబాజీ, నిహారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ అనిత జాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ప్రతి పౌరుడు సేవలందించాలి..

### సమాజం పట్ల బాధ్యత వహించాలి ..

### డాక్టర్ కాపా మురళీకృష్ణ

**ఖమ్మం బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** సమాజం పట్ల ప్రతి పౌరుడు బాధ్యతతో కూడిన సేవలందించాలని

ఖమ్మం జిల్లా డిసిసి హెల్త్ సేల్ చైర్మన్, లయన్ డాక్టర్

డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం

లయన్స్ క్లబ్ అఫ్ వైరా

,గ్రేట్ విజన్ ,అవని ఆద్వర్యంలో ఆర్థిక సహాయం వైరా బ్రాహ్మణపల్లి కి చెందిన చిన్మయి రెడ్డి కి విద్యా అవసరాల కొరకు 10 వేల ఆర్థిక సహాయం, గండగలపాడు గ్రామానికి చెందిన పూర్ణకాంటి లక్ష్మణుడు కి వైద్య ఖర్చులు కొరకు 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం ,లయన్స్ క్లబ్ అఫ్ వైరా, గ్రేట్ విజన్ , అవని మూడు క్లబ్ లు సంయుక్తంగా అందించారు.






ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా డిసిసి హెల్త్ సెల్ చైర్మన్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొని సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమైన ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారని వారికి చేయూతనందించాలని సూచించారు. ప్రతి మనిషి సమాజానికి ఉపయోగపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ ఉంద్రు శ్యాంబాబు ,లయన్ నూకల వాసు ,లయన్ శ్రీమతి ఉంద్రు వరలక్ష్మి , పిఎస్టి లు కొల్లా రాంబాబు ,ఉయ్యూరు రామకృష్ణ , గద్దె నీరజ , కొదుమూరి రవి ,సుగ్గల మాధవి , జాలా పుల్లారావు , చెరుకూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం గ్రామం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తాం..

### తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు

### సీజన వ్యాధులు పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి..

### ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి

**ఖమ్మం బ్యూరో ఆగస్టు 22 ప్రజాబలం:** ప్రజల సంక్షేమం గ్రామ అభివృద్ధి దేంగా పనిచేస్తామని తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరావు అన్నారు.

సీజన్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలనిఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, ఈవో శ్రీ హరికృష్ణ సూచించారు.




సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు తల్లాడ గ్రామంలో బ్లీచింగ్ శానిటేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.



ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరావు మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు, కలుషిత నీటి కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అదేవిధంగా సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి,మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, ఈవో శ్రీహరిక్రిష్ణ, వార్డు మెంబెర్ సరికొండ శ్రీనివాస రాజు,పెరిక కిట్టు, గ్రామపంచాయతీ సిబ్బంది సురేందర్ రెడ్డి చాంద్, తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com